# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 92 | విశాఖపట్నం | 1-1-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 92 | VISAKHAPATNAM | 1-1-2026 THURSDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram










## ఆలయాల్లో అక్రమాలు జరిగితే
# కఠిన చర్యలు: ఆనం



**నెల్లూరు, పతాకం న్యూస్:** కోనసీమ జిల్లా ద్రాక్షారామంలోని బీమేశ్వరస్వామి ఆలయంలో శివలింగాన్ని ధ్వంసం చేయడం ద్వారా హైందవుల మనోభావాలు దెబ్బదీశారని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మండిపడ్డారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించామన్నారు. సీసీ కెమెరా ఆధారంగా దోషులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. బుధవారం నెల్లూరులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవి చంద్ర, స్థానిక లోక్‌సభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. బైక్‌పై వచ్చిన వ్యక్తి తనని గుర్తు పట్టకుండా.. ముఖాన్ని దాచుకొని వచ్చినట్టు నిర్ధారణకు అధికారులు వచ్చారన్నారు. ఆలయంలో వ్యక్తిపై ఉన్న కోపాన్ని ఇలా విధంగా చూపినట్టు గుర్తించారని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ శివలింగన్ని ఏర్పాటు చేసి పూజలు జరిపించారని వివరించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. ఇక నంద్యాలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో దేవుడి అలంకరణ కోసం వినియోగించే వస్తువులు నకిలీ వెండి వస్తువులని తేలిందన్నారు. వెండి ఆభరణాలు.. ఎలా నకిలీ వస్తువులుగా మారాయనే దానిపై విచారణ జరిపిస్తున్నామని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేసులు నమోదు చేయాలని ఇప్పటికే ఎండోమెంట్ అధికారులకు ఆదేశించామని గుర్తు చేశారు.సింహాచలం శ్రీలక్ష్మినరసింహ స్వామి ఆలయంలో ప్రసాదం తయారీ కౌంటర్లో తప్పు చేసిన వ్యక్తిపై చర్యలకు ఇప్పటికే ఆదేశించామని వివరించారు. ప్రసాదంపై భక్తుల ఆరోపణలకి స్పందించాల్సిన అధికారి.. వారిపై దురుసుగా ప్రవర్తించడం కరెక్ట్ కాదన్నారు. హిందూ ధర్మం, సనాతన ఆచారాలకు లోటు జరిగితే ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ఆయన హెచ్చరించారు.

## 'పోలవరం'పై జలశక్తిశాఖ ప్రకటన..
# కేంద్ర నిధుల్లో 99.38 శాతం ఖర్చయినట్లు వెల్లడి



**అమరావతి, పతాకం న్యూస్:** పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల్లో 99.38 శాతం ఖర్చు చేసినట్లు కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. కేంద్రం 2014 ఏప్రిల్ 1 నుంచి 2025 అక్టోబరు 31 వరకు రూ.20,658.67 కోట్లు విడుదల చేయగా, అందులో రూ.20,532.38 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. 2025లో మంత్రిత్వశాఖ సాధించిన పురోగతిని వివరిస్తూ విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ప్రాజెక్టు 2,467.50 మీటర్ల ఎర్త్ కం రాక్‌ఫిల్‌డ్యాం, 1,121.20 మీటర్ల పొడవైన స్పిల్‌వేతో ఉంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లోని 2.91 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇంక దీంతోపాటు అనేక ప్రయోజనాలు ఉంటాయి.

ఈ పనులకు కేంద్ర ప్రభుత్వం 100% నిధులను సమకూరుస్తోంది. భారత ప్రభుత్వం తరఫున ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను చేస్తోంది. రివైజ్డ్ కాస్ట్ కమిటీ ఈ ప్రాజెక్టు వ్యయాన్ని ఈఎల్ ం 45.72 మీటర్ల వరకు 2013–14 ధరల ప్రకారం రూ.29,027.95 కోట్లుగా, 2017–18 ధరల ప్రకారం రూ.47,725.74 కోట్లుగా ఆమోదించింది. ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత 2024 జూన్ వరకు నిర్మాణ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.15,605.96 కోట్లు విడుదల చేసింది. 2024 ఆగస్టు 28న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రాజెక్టు వ్యయాన్ని ఈఎల్ ం41.15 మీటర్ల వరకు నీటిని నిల్వ చేసేంత వరకు రూ.30,436.95 కోట్లుగా ఖరారు చేసింది. దాని ప్రకారం కేంద్రం ఇవ్వాల్సిన మిగిలిన గ్రాంట్లు రూ.12,157.53 కోట్ల వరకు ఉంటాయి. కేంద్ర మంత్రివర్గం ఆమోదం మేరకు జలశక్తిశాఖ మొదటిదశ పనుల కోసం 2024–25లో 2 విడతల్లో రూ.5,052.71 కోట్లు విడుదల చేసింది.



### దేశ వ్యాప్తంగా డెలివరీ బాయ్స్ సమ్మె

7లో



### మూలన పడిన తిరుపతిలో స్మార్ట్ సిటీ!

5లో

## పోలవరం ప్రాజెక్టు పనులు
# 87 శాతం పూర్తి: నిమ్మల




**అమరావతి, పతాకం న్యూస్:** పోలవరం ప్రాజెక్టు పనులు ఇప్పటి వరకు 87 శాతం పూర్తి చేశామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై మంత్రి నిమ్మల సమీక్ష నిర్వహించారు. జనవరి మొదటి వారంలో వెలిగొండ ప్రాజెక్టును సీఎం చంద్రబాబు సందర్శిస్తారని మంత్రి తెలిపారు. రూ.456 కోట్లతో చేపట్టనున్న వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులను సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. రూ.456 కోట్లతో చేపట్టనున్న వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులను సీఎం ప్రారంభిస్తారన్నారు. పోల వరం ప్రాజెక్టులో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం 83శాతం పూర్తయిందన్నారు. షెడ్యూల్ ప్రకారం పనులు చేస్తూ 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. నీటి పారుదలశాఖ సలహాదారు, ఈఎన్‌సీ, ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.



## న్యూ ఇయర్ వేడుకలకు
# సిద్ధమైన విశాఖ

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కొత్త సంవత్సరానికి ఘనంగా ఆహ్వానం పలకడానికి నగరవాసులు సిద్ధమవుతున్నారు. బుధవారం రాత్రి ప్రత్యేక వేడుకలు నిర్వహించేందుకు పలు స్టార్ హోటళ్లు, రిసార్టుల యాజమాన్యాలు ఏర్పాట్లు చేశాయి. తమ కార్యక్రమాలకు సినీ నటులు, గాయకులు, సెలబ్రిటీలను రప్పిస్తున్నాయి. రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్లో జరిగే ఈవెంట్‌కు సినీ నటి హెబ్బాపటేల్ హాజరవుతున్నారు. వేడుకలకు హాజరయ్యేవారి కోసం పలు కేటగిరీల కింద టికెట్లు విక్రయిస్తున్నారు. ఇవి రూ.రెండు వేలు నుంచి రూ.50 వేలు వరకూ ఉన్నాయి.

అలాగే నోవాటెల్ హోటల్ న్యూ ఇయర్ గ్రాండ్ సెలబ్రేషన్స్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడ జరిగే వేడుకలకు సినీ నేపథ్య గాయిని సమీరా భరద్వాజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు.

అప్పుఘర్ సమీపంలోని గాదిరాజు ప్యాలెస్‌లో కూడా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసి.. సినీ ప్రముఖులను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించనున్నారు. ఇంకా బీచ్ రోడ్డులోని పార్కు హోటల్, రుషికొండలోని షోర్ ఫ్రంట్ రెస్టారెంట్, భీమిలిలోని నోవాటెల్, గాజువాకలోని సిగ్నేచర్ హోటల్తో పాటు మరికొన్ని న్యూఇయర్ ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటుచేస్తున్నాయి. వీటిలో పాల్గొనాలనుకునేవారి కోసం టికెట్లను ఆన్లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంచాయి. ఆన్లైన్లో టికెట్లను బుక్ షో లేదా డిస్ట్రిక్ జొమాటో యాప్‌ల నుంచి కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉంది.




పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## దిద్దుబాటు!

న్యాయవ్యవస్థ ప్రతిష్ట మసకబారుతున్న సమయంలో అత్యున్నత న్యాయస్థానం దిద్దుబాటు చర్యలు చేపట్టటం మంచిదే! ఉన్నావో అత్యాచార కేసులో దోషిగా తేలిన బిజెపి మాజీ ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్‌కు బెయిల్ ఇచ్చి ఢిల్లీ హైకోర్టు తీవ్ర తప్పిదానికి పాల్పడింది. దానిపై దేశమంతా భగ్గుమంది. ఆరావళి పర్వతాల్లో యథేచ్ఛగా మైనింగ్ చేపట్టేందుకు వీలుగా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తాయి. వీటి పర్యవసానంగా అత్యున్నత న్యాయస్థానం పునరాలోచన చేసినట్టు కనిపిస్తోంది. ఉన్నావోలో 15 ఏళ్ల నిరుపేద దళిత బాలికపై 2018లో అప్పటి బిజెపి ఎమ్మెల్యే సెంగార్ అత్యాచారానికి ఒడిగట్టడం, ఆమె తండ్రిని పోలీస్ కస్టడీలోనే పొట్టనపెట్టుకోవడం అత్యంత దుర్మార్గం. అత్యాచారం కేసులో జీవిత ఖైదు (మరణించే వరకూ జైలులోనే), పోలీసు కస్టడీలో బాలిక తండ్రిని హత్య చేయించిన కేసులో పదేళ్ల జైలు శిక్ష పడింది. బాలిక వెళ్తున్న కారును లారీతో ఢీ కొట్టించి చంపే ప్రయత్నంలో ఆమె, న్యాయవాది తీవ్రంగా గాయపడగా, బాధితురాలి ఇద్దరు అత్తలు ప్రాణాలు కోల్పోయారు. మరో కీలక సాక్షి అనుమానాస్పదంగా మరణించాడు. జైలులో ఉండే అనేక ఘాతుకాలు చేయించిన సెంగార్‌కు ట్రయల్ కోర్టు విధించిన శిక్షను సస్పెండ్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. శిక్షను సస్పెండ్ చేస్తున్నామని ఇచ్చిన తీర్పు ఉన్నావో బాధితురాలికే కాదు॥% సమాజంలో అణచివేతకు గురవుతున్న మహిళలందరికీ పెను ముప్పే! బాధితురాలు, సిబిఐ పిటిషన్లు దాఖలు చేయడంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని వెకేషన్ బెంచ్ విచారణ జరిపింది. 'ఒక కానిస్టేబుల్ పబ్లిక్ సర్వెంట్ అయినప్పుడు శాసన సభ్యుడు ప్రజాసేవకుడు కాడా? ఎమ్మెల్యేను మినహాయించడం సరైందేనా?' అన్న సుప్రీం ప్రశ్న అత్యంత సమంజసం. కేసుకు సంబంధించిన ప్రత్యేక పరిస్థితులను, వాస్తవాలను దృష్టిలో పెట్టుకుని నిలిపివేస్తున్నామన్న ప్రకటన బాధిత కుటుంబానికి ఊరట. ఇలాంటి నేరగాళ్లకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ అందలమెక్కిస్తున్న అధికార పార్టీ కూడా దోషే! ఆరావళి శ్రేణిలో వంద మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న కొండలనే పర్వతాలుగా పరిగణిస్తూ కేంద్రం ఇచ్చిన కొత్త నిర్వచనానికి అనుకూలంగా తానే ఇచ్చిన ఉత్తర్వులను నిలుపు చేస్తూ సుప్రీంకోర్టు పునరాలోచనలో పడింది. ఫలానా ఎత్తున్న కొండలనే ఆరావళి పర్వతాలుగా పరిగణించాలనే నిర్వచనం అమలులోకి వస్తే 95 శాతం కొండలు అంతరిస్తాయని పర్యావరణవేత్తలు మొదలు సామాన్య ప్రజానీకం వరకూ రోడ్డెక్కారు. పర్వతాల ఎత్తుపై నిర్వచనం ఇవ్వడంలో సహేతుకత లోపించిందని, సంబంధిత కమిటీ నివేదికలో, తీర్పులో ఇలాంటి పలు సంక్లిష్టమైన, కీలక అంశాలపై దృష్టి పెట్టలేదని పేర్కొంటూ.. ఇటీవల ఇచ్చిన తీర్పును అన్వయిస్తూ ఎటువంటి మైనింగ్ కార్యకలాపాలు చేపట్టకూడదని సిజెఐ నేతృత్వంలోని వెకేషన్ బెంచ్ తాజాగా ఆదేశించడం తాత్కాలిక ఊరట. పర్యావరణానికి పెట్టని కోటగా, థార్ ఎడారి విస్తరించ కుండా అడ్డుకుంటున్న కోట్ల సంవత్సరాల చరిత్ర ఉన్న ఆరావళి ప్రస్తుతానికి ఊపిరిపీల్చుకుంది. కార్పొరేట్ల అత్యాసకు వంతపాడుతున్న పాలకుల చర్యల వల్ల ఇప్పటికే అడవులు, కొండలు, పలు రకాల పక్షులు, జంతువులు అంతరించి పోతున్నాయి. ప్రకృతి ప్రకోపిస్తోంది. కాలుష్యం దావానలంలా కమ్మేస్తోంది. ఈ పరిస్థితుల్లో దేశంలో అత్యంత పురాతనమైన పర్వతాలు, కొండలు 'కార్పొరేట్ బకాసురుల' చేతికి చిక్కకుండా కాపాడగలిగితేనే నేటి దిద్దుబాటుకు అర్థం ఉంటుంది. అన్ని వ్యవస్థలనూ భ్రష్టుపట్టిస్తూ, ఉత్తర ప్రదేశ్‌లో నిరుపేద దళిత బాలిక కుటుంబంపై పగబట్టిన 'మను ధర్మ' దాష్టీకానికి, కార్పొరేట్‌లకు 'పర్వతాలను', భవిష్యత్ తరాల ఆశలను దోచిపెట్టేందుకు సిద్ధమైన పాలకులను నిలువరించగలిగేది ప్రజా గళమే. స్వతంత్రంగా వ్యవహరించి ప్రజల మౌలిక హక్కులను, రాజ్యాంగాన్ని, ప్రకృతిని పరిరక్షిస్తేనే అత్యున్నత న్యాయ స్థానం చర్యలు అర్థవంతమౌతాయి.

## పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఏపీలో నూతన సంవత్సర కానుకగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఇవాళ పండుగ వాతావరణంలో జరిగింది. సాధారణంగా ప్రతినెలా ఒకటో తేదీన జరిగే ఈ కార్యక్రమం.. జేనవరి 1వ తేదీసెలవు దినం కావడంతో ఒక రోజు ముందుగానే నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచే వాలంటీర్లు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నగదు పంపిణీ చేయగా, మధ్యాహ్నం 12 గంటల సమయానికి రికార్డు స్థాయిలో 87 శాతం పంపిణీ పూర్తయింది. ఈ నెలలో మొత్తం 63.12 లక్షల మంది లబ్ధిదారుల కోసం ప్రభుత్వం రూ.2,743 కోట్లు విడుదల చేసింది. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా నందిగం మండలం దీనబంధుపురంలో గతంలో పింఛన్లు నిలిచిపోయిన 9 మందికి కోర్టు ఆదేశాల మేరకు బకాయిలతో సహా పింఛన్లను పునరుద్ధరించారు. నిలిపివేసిన రోజు నుంచి ఇప్పటివరకూ లెక్కించిన మొత్తం రూ.18 లక్షలను మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా ఆ 9 మంది లబ్ధిదారులకు అందజేయడం విశేషం. మరోవైపు ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు పింఛన్ల కోసమే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. పేదల జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ కార్యక్రమం తనకు ఎంతో సంత ృప్తిని ఇస్తుందని, కొత్త ఏడాదిలో అందరికీ మంచి జరగాలని సీఎం ఆకాంక్షించారు.

## తిరుమల కల్తీ నెయ్యి కేసులో టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిని సుదీర్ఘంగా ప్రశ్నించిన సిట్



**అమరావతి, పతాకం న్యూస్:** కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తు మరింత వేగం పుంజుకుంది. ఈ కేసులో భాగంగా టీటీడీ పాలకమండలి సభ్యురాలు, నెల్లూరు జిల్లా కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిని సిట్ అధికారులు విచారించారు. తిరుపతి నుంచి ప్రత్యేక బ ృందంగా నెల్లూరులోని ఆమె నివాసానికి చేరుకున్న సిట్ అధికారులు రోజంతా సుదీరంగా ప్రశ్నలు సంధించారు. టీటీడీలో ఆమె నిర్వహించిన బాధ్యతలు, అప్పటి కొనుగోళ్ల విధానాలపై ప్రధానంగా ద ృష్టి సారించినట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగు నెలల పాటు ప్రశాంతి టీటీడీ కొనుగోళ్ల కమిటీ సభ్యురాలిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో ఆ సమయంలో కమిటీ ఎలా పనిచేసేది, కొనుగోళ్లపై ఎవరి నిర్ణయాలు ఉండేవి, సభ్యుల పాత్ర ఏమిటన్న అంశాలపై సిట్ అధికారులు వివరాలు సేకరించారు. ముఖ్యంగా అప్పట్లో నెయ్యి సరఫరాకు సంబంధించి ఏమైనా అనుమానాలు, ఫిర్యాదులు మీ ద ృష్టికి వచ్చాయా? అనే ప్రశ్నలు వేసినట్లు సమాచారం. ఈ అంశాలపై స్పందించిన ప్రశాంతి... తాను కేవలం నాలుగు నెలలపాటు మాత్రమే పర్చేజ్ కమిటీలో ఉన్నానని, టీటీడీ కొనుగోళ్ల వ్యవహారాలపై పూర్తిస్థాయి అవగాహన తనకు లేదని చెప్పినట్లు తెలిసింది. ఆరున్నరేళ్ల కింద జరిగిన విషయాలను ఇప్పుడు గుర్తు చేసుకోవడం కష్టమని కూడా ఆమె వ్యాఖ్యానించినట్లు సమాచారం. నెయ్యి సరఫరాలో అవకతవకల గురించి అప్పట్లో తనకు ఎలాంటి సమాచారం అందలేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఇదే కేసులో ఇప్పటికే పలువురు కీలక నేతలను సిట్ విచారించిన సంగతి తెలిసిందే. టీటీడీ మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డిలను విచారించిన అధికారులు, లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న అప్పటి టీటీడీ ఎక్స్‌అఫిషియో సభ్యుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కూడా జైలులోనే ప్రశ్నించారు. కల్తీ నెయ్యి వ్యవహారం టీటీడీ ప్రతిష‘కు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో, ఈ కేసులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా లోతైన విచారణ జరుపుతామని సిట్ అధికారులు స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. ఈ దర్యాప్తులో ఇంకా ఎవరెవరి పేర్లు వెలుగులోకి వస్తాయన్న ఉత్కంఠ నెలకొంది.

## వాసవి క్లబ్ యూత్ ఆర్థిక సహకారం



**చోడవరం, పతాకం న్యూస్ :** వాసవి క్లబ్ యూత్ సభ్యుడు కల్లేపల్లి గోవింద్ ఈ నెల 25న స్వర్గస్తులైనారు వారి కుటుంబం సహాయ నిమిత్తం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల్లా రామకృష్ణ ప్రవేశపెట్టిన మహాప్రస్థానం అను కార్యక్రమం ద్వారా 25000/-మన జిల్లా గవర్నర్ కొల్లూరు పూర్ణిమ వారి చేతుల మీదుగా అందించడం జరిగింది ఈ కార్యక్రమానికి డోనర్ సెందిల్ వారు, వాసవి యూత్ క్లబ్ సభ్యుల ద్వారా 29600/-ఆర్థిక సాయం వారికి అందించడం జరిగింది ఈ కార్యక్రమం లో జిల్లా గవర్నర్ అయినటువంటి కొల్లూరు పూర్ణిమ ఐఇసి కలగర్ల శేషగిరిరావు కాబోయే గవర్నర్ పూసర్ల రమణమూర్తి శ్రీనాథ్ శీను సీఎంఆర్ ఇన్చార్జ సత్యవరపు శ్రీను ఆర్సి పసుమర్తి అశోక్ జెడ్సి కొల్లూరు మణికుమార్ క్లబ్ ప్రెసిడెంట్ పెన్నం రాజు సెక్రెటరీ విన్నకోట రాజేష్ మరియు క్లబ్ పూర్వపు అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి దుర్గేష్



**తూర్పుగోదావరి, పతాకం న్యూస్:** పెరవల్లి మండలం అన్నవరప్పాడు గ్రామంలో బుధవారం ఉదయం ఎన్టీఆర్ పింఛన్ పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పింఛన్ లబ్ధిదారులు అడ్డాల వెంకటలక్ష్మి, పాలపర్తి చిట్టెమ్మ, కోటిపల్లి సర్వేశ్వరరావులకు ఆయన చేతుల మీదగా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా నాయకులు రంగనీడి గంగాధర్ కుమారుడు బాబి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈయన వెంట తెదేపా మండల అధ్యక్షులు అతికాల శ్రీను, గ్రామ జనసేన అధ్యక్షులు పొప్పాపు వెంకట నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు భూపతి రాజు, రవివర్మ, పొప్పాపు సూర్య నాగేశ్వరరావు, రంగినీడి కట్లయ్య, తహసిల్దార్ కె. నిరంజన్ ఎంపీడీవో పద్మజ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మద్దూరు గ్రామంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆభరణాల మాయం



**నంద్యాల, పతాకం న్యూస్:** నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం మద్దూరు గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘటన భక్తులను తీవ్రంగా కలచివేసింది. అత్యంత పవిత్రంగా భావించే వైకుంఠ ఏకాదశి రోజునే స్వామివారి వెండి ఆభరణాలు మాయం కావడం ఆలయ ప్రాంగణంలో కలకలం రేపింది. మరింత బాధాకరమైన విషయం ఏమిటంటే, ఆ రోజు స్వామివారిని నకిలీ ఆభరణాలతో అలంకరించిన విషయం తర్వాత బయటకు రావడం. వైకుంఠ ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుంటారు. అలాంటి ముఖ్యమైన రోజున అసలు ఆభరణాల స్థానంలో నకిలీ ఆభరణాలు ఉండటాన్ని గమనించిన భక్తులు ఆలయ సిబ్బందిని ప్రశ్నించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. స్వామివారి ఆభరణాల విషయంలో ఇంత నిర్లక్ష్యం ఎలా జరిగిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆలయ నిర్వాహకులపై అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆలయానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ఆలయ పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తూ దర్యాప్తు చేపట్టారు. ఆభరణాలు ఎప్పుడు, ఎలా మాయం అయ్యాయి? ఇందులో ఎవరి ప్రమేయం ఉంది? అన్న కోణాల్లో విచారణ కొనసాగుతోంది. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల్లోని పలు ఆలయాల్లో స్వామివారి ఆభరణాల చోరీ ఘటనలు తరచుగా జరుగుతుండటం భక్తుల్లో తీవ్ర అసంత ృప్తిని కలిగిస్తోంది. ఆలయాల భద్రతా వ్యవస్థలపై పెద్ద ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేవాలయాలు భక్తుల విశ్వాసానికి కేంద్రాలు కావడంతో, ఇలాంటి ఘటనలు పునరావ ృతం కాకుండా ప్రభుత్వం, దేవాలయ యాజమాన్యాలు కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## డీవీఎంసీ సభ్యునిగా (ఎస్సీ ఎస్టీ డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ మెంబర్) ములకలపల్లి రాజు నియామకం



**పరవాడ, పతాకం న్యూస్ :** అనకాపల్లి జిల్లా ఎస్సీ ఎస్టీ డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మోనిటరింగ్ (డివిఎంసి) సభ్యునిగా ములకలపల్లి రాజు (ఎండి రాజు) ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయ్ కృష్ణన్ చేతుల మీదగా ఉత్తర్వులు అందుకున్నారు. ఎస్సీ ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి, వారి హక్కులు విధులుపై అవగాహన కల్పించడానికి, వారి అభివ ృద్ధికి డివిఎంసి క ృషి చేస్తుంది. డివిఎంసి కి చైర్మన్ గా జిల్లా కలెక్టర్ ఉంటారు. ఇందులో ఎన్జీవోలు ముగ్గురు, ఎస్సీ మాల వర్గం నుండి ఇద్దరు, ఎస్సీ మాదిగ వర్గం నుండి ఇద్దరు, రెల్లి వర్గం నుండి ఒకరు మొత్తం ఎనిమిది మంది సభ్యులుగా ఉంటారు. డివిఎంసి సభ్యునిగా రాజును నియమించడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ ఎస్టీ వర్గాల అభివ ృద్ధికి, వారి హక్కుల పరిరక్షణకు తన వంతు క ృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ పదవి రావడంలో విశేషం క ృషి చేసిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు, జనసేన పార్టీ మండల ఇన్చార్జ్ పంచకర్ల ప్రసాద్, ఉమ్మడి రూరల్ విశాఖ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బుగిడి రామ గోవిందరావులకు ఈ సందర్భంగా క ృతజ్ఞతలు తెలియజేశారు.

## చదువుతో సమాజ సేవకు అవకాశం

**చింతపల్లి, పతాకం న్యూస్:** చదువు విద్యార్థులకు జ్ఞానంతో పాటు సమాజ సేవ చేయటానికి అవకాశాలను కల్పిస్తుందని,విద్యార్థి జీవితం వ్యక్తి భవిష్యత్తును నిర్ణయి ంచే కీలక దశ అని,ఈ సమయంలో విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యత వంటి ముఖ్యమైన లక్షణాలను అలవర చుకోవాలని చింతపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సిందేరి రాజేశ్వరి అన్నారు.సమయానికి పాఠశా లకు చేరుకోవడం,అప్పగించిన పనులను పూర్తిచేయడం వంటి అలవాట్లు విద్యార్థుల అభివ ృద్ధికి దోహదపడ తాయని అన్నారు.చదువులో ఆసక్తిని పెంపొందిం చుకొని,ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల సహకారంతో ముందుకు సాగాలని,చదువులో ఎదురయ్యే ఇబ్బందులను సహనంతో ఎదుర్కోవాలని సూచించారు. విద్యార్థులు తమకు తగిన లక్ష్యాలను నిర్దేశించుకొని,వాటిని సాధించేందుకు కష్టపడాలని పిలుపునిచ్చారు.చదువు ద్వారా జ్ఞానం లభిస్తుందని,ఆ జ్ఞానం జీవితంలో ముందుకు సాగేందుకు దోహదపడుతుందని తెలిపారు.

# గదబపాలెం పంచాయతీలో ఘనంగా పెసా గ్రామ సభ



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం గదబపాలెం పంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభను ఘనంగా నిర్వహించారు. పెసా అధ్యక్షులు నీలాపు సింహాచలం అధ్యక్ష తన జరిగిన ఈ గ్రామసభకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్టీఐ కార్యదర్శి ఎన్.సూరిబాబు ముఖ్య అతిథిగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందరరేగా సూరిబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివ ృద్ధికి పెసా చట్టం ఎంతో కీలకమని తెలిపారు. గ్రామసభలు, పెసా కమిటీలకు చట్టం ద్వారా కల్పించిన హక్కులు, అధికారాలను ప్రజలు పూర్తిగా అవగాహన చేసుకోవాలని సూచించారు. సహజ వనరుల పరిరక్షణ, గ్రామాభివ ృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో గ్రామసభల పాత్ర అత్యంత ప్రాధాన్యత కలిగినదని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల సమగ్ర అభివ ృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. పెసా అధ్యక్షులు నీలాపు సింహాచలం మాట్లాడుతూ, పెసా చట్టం గిరిజనుల స్వయం పాలనకు దోహదపడుతుందని, గ్రామస్థులు గ్రామసభల్లో చురుకుగా పాల్గొని తమ సమస్యలను పరిష్కరించు కోవాలని పిలుపునిచ్చారు. గ్రామాభివ ృద్ధి పనుల్లో ప్రజల సూచనలు, నిర?యాలు కీలకమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెసా ఉపాధ్యక్షులు ఉల్లి రామ్మూర్తి, పెసా కమిటీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అడ్డరోడ్డులో కొత్త రెవెన్యూ డివిజన్



**అనకాపల్లి, పతాకం న్యూస్:** పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా జిల్లాలో అడ్డరోడ్డు జంక్షన్ కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తుది నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ జీఓ ఎంఎస్ నంబర్ 515ను జారీ చేశారు. కొత్త డివిజన్ ఏర్పాటుపై సుమారు నెల రోజులపాటు ప్రజల నుంచి స్వీకరించిన అభ్యంతరాలను పరిశీలించిన ప్రభుత్వం తాజాగా తుది నిర్ణయం తీసుకుంది. అనకాపల్లి డివిజన్‌లోని ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలను, నర్సీపట్నం డివిజన్‌లోని పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాలను అడ్డరోడ్డులో ఏర్పాటు చేసే కొత్త రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకువచ్చారు. ఇక నర్సీపట్నం డివిజన్‌లో వున్న చీడికాడ మండలాన్ని అనకాపల్లి డివిజన్‌లో చేర్చారు. దీంతో అనకాపల్లి డివిజన్‌లో అనకాపల్లి, కశింకోట, మునగపాక, సబ్బవరం, పరవాడ, చోడవరం, బుచ్చెయ్యపేట, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు.. మొత్తం 10 మండలాలు వుంటాయి. నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, రోలుగుంట, రావికమతం, మాడుగుల.. మొత్తం ఏడు మండలాలు మాత్రమే నర్సీపట్నం డివిజన్‌లో వుంటాయి. రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని అడ్డరోడ్డు కేంద్రంగా కొత్తగా ప్రకటించిన రెవెన్యూ డివిజన్ కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని తహశీల్దారు రమేశ్‌బాబు తెలిపారు. ఆయన అడ్డరోడ్డులో మీడియాతో మాట్లాడుతూ, ఆర్డీవో కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హాజరుకానున్నట్టు చెప్పారు. అంతకుముందు ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు కోసం తిమ్మాపురం పంచాయతీ కార్యాలయం, సచివాలయం నిర్వహిస్తున్న రెండు అంతస్థుల భవనాన్ని నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, వైస్‌ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధంతో కలిసి పరిశీలించారు. ఇది అన్ని విధాలా అనుకూలంగా వుండడంతో అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు సర్పంచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో పంచాయతీ తీర్మానం చేయించారు. సచివాలయం, పంచాయతీ కార్యాలయం నిర్వహణకు పక్కనే కొత్తగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాన్ని కేటాయించారు. రెండు కార్యాలయాల రికార్డులు, కంప్యూటర్లు, ఇతర సామగ్రిని యుద్ధప్రాతిపదికన ఈ భవనంలోకి తరలించారు. ఆర్డీవో కార్యాలయం కోసం తీసుకున్న భవనానికి రంగులు వేయడం ప్రారంభించి, రాత్రికి పూర్తిచేశారు.

## 79వ వార్డులో ఒకరోజు ముందుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ



**పరవాడ, పతాకం న్యూస్:** గ్రేటర్ విశాఖ, 79వ వార్డు పరిధిలో ఉన్న లంకెలపాలెం మరిడిమాంబ కాలనీ, గొల్లపేట, దేశపాత్రునిపాలెం సాయినగర్ కాలనీ, పాత అగనంపూడి తదితర ఏరియాలలో బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమము ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పాల్గొని ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ లెజెండరీ ముఖ్యమంత్రి పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సాధకబాధలు తెలిసిన వ్యక్తి నారా చంద్రబాబు నాయుడని కొనియాడారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్రమంత్రి నారా లోకేష్ బాబు క ృషి ఫలితమే ప్రతి నెల పెన్షన్లు ఇచ్చే కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు కరణం సత్యారావు, వార్డ్ అధ్యక్షులు కరణం జగదీష్, ఎర్ర కోటేశ్వరరావు, కరణం అప్పారావు, మచ్చ శివకుమార్, లక్కరాజు శ్రీనివాస్, లక్కరాజు వెంకటేష్, అమర పిన్ని శ్రీను, నున్న గొప్పుల జనార్దన్, కరణం రమణ , మాడిస వెంకట్రావు, డి.సుబ్బరాజు, కరణం పైడిరాజు, ప్రవీణ్, సూర్య, ఉరుకుటి అప్పలనాయుడు. తదితర ఉమ్మడి పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తీరనున్న డోలీ కష్టాలు



**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** సొవ్వా పంచాయతీ మారుమూల సాగరివలస గ్రామానికి దశాబ్దాల నాటి కల నెరవేరింది. ఎట్టకేలకు రహదారి నిర్మాణం జరుగుతోంది. దీని వలన 13 గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. డోలీ మోతల కష్టాలు ఉండకూడదని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో సొవ్వా పంచాయతీ కేంద్రం జంక్షన్ నుంచి మారుమూల సాగరివలస గ్రామం వరకు 15 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో రెండు వారాల క్రితం రహదారి నిర్మాణ పనులు ప్రారంభమై జోరుగా సాగుతున్నాయి. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే 13 గ్రామాల ప్రజలకు మేలు జరగనుంది. ఇప్పటి వరకు ఆయా గ్రామస్థులు అత్యవసర వైద్య సేవలకు డోలీలనే ఆశ్రయిస్తున్నారు. పంచాయతీ కేంద్రానికి కాలినడ కనే వెళుతున్నారు. ప్రస్తుతం ఈ రహదారి పనులు జరుగుతుం డడంతో తమ కష్టాలు తీరనున్నాయని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం




**పాడేరు,, పతాకం న్యూస్:** వాతావరణంలో మార్పులతో మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. పొగమంచు సైతం దట్టంగా కమ్మేస్తున్నది. జిల్లా కేంద్రం పాడేరుతో సహా ఏజెన్సీలో ఉదయం పదిన్నరగంటల వరకు దట్టంగా పొగమంచు కురిసింది. దీంతో ఎదురుగా ఉన్న వ్యక్తులు సైతం కనిపించని విధంగా ఉండడంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. తాజా శీతల వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. మంగళవారం జి.మాడుగులలో 7.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, అరకులోయలో 7.1, ముంచంగిపుట్టులో 7.8, డుంబ్రిగుడలో 8.2, పెదబయలులో 9.9, చింతపల్లిలో 10.7, హుకుంపేటలో 11.2, పాడేరులో 11.3, కొయ్యూరులో 13.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముంచంగిపుట్టు మండలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం 10 గంటల వరకు పొగమంచు కురుస్తూనే ఉంది. దీంతో ఉదయాన్నే పనులకు వెళ్లే రైతు కూలీలు, ఉద్యోగులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

## నూతన యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ




**డుంబ్రిగుడ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలో బుధవారం యూనైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యుటిఎఫ్) మండల శాఖ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి గాను డైరీ మరియు క్యాలెండర్ ను ఘనంగా ఆవిష్కరించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎస్. బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె. రాజారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివ ృద్ధి అధికారి (ఎంపీడీఓ), మండల విద్యాశాఖ అధికారి-1, మండల విద్యాశాఖ అధికారి-2 చేతుల మీదుగా డైరీ మరియు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందరరేగా ఎంపీడీఓ, మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ, యుటిఎఫ్ డైరీ మరియు క్యాలెండర్ ప్రింటింగ్ నాణ్యత చాలా ఆకర్షణీయంగా ఉందని, యుటిఎఫ్ సంఘం పోరాట పటిమ గలదని అభినందించారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు కె. రఘునాథ్, కార్యదర్శి ఎస్. కన్నయ్య ప్రత్యేకంగా పాల్గొని మాట్లాడారు. యుటిఎఫ్ సంఘం నిరంతరం ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతోందని పేర్కొన్న వారు, ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ట్రెజరర్ టి. సుబ్బారావు, జి. దుర్గ, మండల నాయకులు కె. సీత, కె. జెన్ను, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లాలో తగ్గిన నేరాలు

### వివరాలు వెల్లడించిన ఎస్పీ తుహిన్ సిన్హా





**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో ఈ ఏడాది కొన్ని రకాల నేరాలు పెరగ్గా, మరికొన్ని రకాల నేరాలు తగ్గాయి. ప్రధానంగా సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు బాగా పెరిగాయి. అచ్యుతాపురంలో సైబర్ నేరగాళ్లు కాల్‌సెంటర్ల ముసుగులో ఈ-కామర్స్ నకిలీ యాప్‌లతో మోసాలకు పాల్పడ్డారు. ఆలస్యంగా గుర్తించిన పోలీసులు వీరి ఆటకట్టించి, కటకటాల వెనక్కు నెట్టారు. ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. జిల్లాలో ఈ ఏడాది కాలంలో జరిగిన వివిధ రకాల నేరాలు, ప్రమాదాలకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ తుహిన్‌సిన్హా వెల్లడించారు. గత ఏడాది వివిధ పోలీసు స్టేషన్‌లలో మొత్తం 7,573 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఆ సంఖ్య 5,821కి తగ్గిందన్నారు. గత ఏడాది మహిళలపై నేరాలకు సంబంధించి 387 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 291 కేసులు నమోదయ్యాయి. పోక్సో కేసులు దాదాపు ఒకేలా వున్నాయి. తీవ్రమైన నేరాలు, ప్రాణహాని కలిగించే నేరాలు గత ఏడాది 591 నమోదు కాగా ఈ ఏడాది 417 కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 54 శాతం మేర తగ్గడం విశేషం. రహదారి, ఇతర ప్రమాదాల్లో మరణాల సంఖ్య ఏడు శాతం తగ్గింది. జిల్లాలో ఆర్థిక నేరాలు గత ఏడాదితో పోలిస్తే 3 శాతం పెరిగాయి. గత ఏడాది 406 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 417 కేసులు నమోదయ్యాయి. మోసపూరిత కేసులు గత ఏడాది 131 నమోదు కాగా ఈ ఏడాది 125, నమ్మకద్రోహం కేసులు గత ఏడాది 18, ఈ ఏడాది 17 కేసులు నమోదయ్యాయి. జిల్లాలో గత ఏడాది మాదకద్రవ్యాల (ఎన్‌డీపీఎస్) కేసులు 162 నమోదు కాగా ఈ ఏడాది 128 కేసులు నమోదయ్యాయి. ఇతర సాధారణ కేసులు గత ఏడాది 4,987 నమోదు కాగా ఈ ఏడాది 3,627కి తగ్గాయి. మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాయి. ముఖ్యంగా కిడ్నాప్ కేసులు 85 శాతం, వరకట్నం కేసులు 11 శాతం తగ్గాయి. మహిళలపై నేరాలకు సంబంధించి 291 కేసులు నమోదయ్యాయి. మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులు ఈ ఏడాది 316 నమోదు వీరిలో 257 మంది సురక్షితంగా ఉన్నట్టు గుర్తించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా జిల్లా పోలీసులు ఈ ఏడాది 128 కేసులు నమోదు చేసి 411 మందిని అరెస్టు చేశారు. సుమారు రూ.4.41 కోట్లు విలువైన 8,791 కిలోల గంజాయి, 7.39 లీటర్ల హ్యాష్ ఆయిల్ (ద్రవ గంజాయి), 114 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులపై ఎన్‌డీపీసీ కేసులు నమోదు చేశారు. వీరికి సంబంధించి రూ.1,25,22,100 విలువగల ఆస్తులను స్తంభింపజేశారు. 312 మంది గంజాయి నిందితులపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేశారు. మాదక ద్రవ్యాల రవాణా, హత్యలు, పోక్సో కేసుల్లో 51 శాతం మంది నిందితులకు కోర్టుల్లో శిక్షలు పడేలా కృషి చేశారు. జిల్లాలో నేరాల కట్టడికి, వివిధ కేసుల్లో నిందితులను త్వరగా పట్టుకోవడానికి జిల్లా పోలీసులు సాంకేతిక వినియోగాన్ని మరింత పెంచారు. ఈ ఏడాది కొత్తగా 3,573 సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో పేకాట, కోడిపందేలు, గంజాయి/మద్యం సేవించడం, గంజాయి రవాణా వంటి వాటిని అరికట్టడానికి డ్రోన్లను వినియోగిస్తున్నారు. సేఫ్ స్టే యాప్ ద్వారా హోటళ్లు, లాడ్జీల్లో బస చేసే వారి వివరాలను, పాత నేరస్థుల డేటాతో సరిపోల్చుతూ అసాంఘిక కార్యకలాపాలను అరికడుతున్నారు. కొత్త సంవత్సరంలో సైబర్ నేరాల అదుపుపై జిల్లా పోలీసు యంత్రాంగం మరింత దృష్టి పెట్టాలని నిర్ణయించింది.

## ఎన్టీపీసీలో విజయవంతంగా ముగిసిన బాంబు తనిఖీ 'మాక్ డ్రిల్'



**పరవాడ, పతాకం న్యూస్:** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా (ఐపీఎస్) ఆదేశాల మేరకు, పరవాడలోని ఎన్టీపీసీ ప్రాంగణంలో బుధవారం బాంబు ముప్పును ఎదుర్కొనే సన్నద్ధతపై 'మాక్ డ్రిల్' నిర్వహించారు. ఎన్టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ, సిఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్ కుమార్, పరవాడ ఇన్‌స్పెక్టర్ ఆర్.మల్లికార్జున రావు నేతృత్వంలో, జిల్లా బాంబు డిస్పోజల్ (బి.డి) టీం మరియు డాగ్ స్క్వాడ్ ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. స్థానిక పరవాడ పోలీసు సిబ్బంది, సీఐఎస్ఎఫ్ (సిఐఎస్ఎఫ్) బలగాలు మరియు ఎన్టీపీసీ భద్రతా విభాగం అధికారులు అత్యంత సమన్వయంతో ఈ ఆపరేషన్‌లో పాలుపంచుకున్నారు. మాక్ డ్రిల్‌లో భాగంగా గుర్తించిన నమూనా బాంబు పరికరాన్ని భద్రతా బ ృందాలు చాకచక్యంగా గుర్తించి, సురక్షితంగా నిర్వీర్యం చేశాయి. అత్యవసర పరిస్థితుల్లో భద్రతా దళాల స్పందన సామర్థ్యాన్ని పరీక్షించడానికి మరియు ప్రజల రక్షణను నిర్ధారించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అత్యంత క్రమశిక్షణతో సాగిన ఈ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రతపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉన్నారని ఈ సందదర్భంగా పోలీసులు భరోసా ఇచ్చారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, పాడేరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి మరియు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు, కొయ్యూరు మండలం, డౌనూరు పంచాయతీ పరిధిలోని డౌనూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కొయ్యూరు మహిళా మండలి అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, సీనియర్ టిడిపి కార్యకర్త రీమల జగన్ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం పేదలు, వ ృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించే ముఖ్యమైన పథకమని తెలిపారు. టిడిపి ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## విశాఖ రైల్వే స్టేషన్‌కు మహర్దశ




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాబోయే ఐదేళ్లలో ఎంపిక చేసిన నగరాల నుంచి రైళ్ల సంఖ్యను రెట్టింపు చేస్తామని, ప్రయాణికులకు వసతి సౌకర్యాలు పెంచుతామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేసిన ప్రకటన ఈ ప్రాంత వాసుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ఆ నగరాల్లో విశాఖపట్నం కూడా ఉండడమే దీనికి కారణం. విశాఖ రైల్వే స్టేషన్‌ను రూ.500 కోట్లతో అభివృద్ధి చేయడానికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. ప్లాట్‌ఫారాల సంఖ్యను ఎనిమిది నుంచి 14కు పెంచనున్నట్టు ఇటీవలె ఎంపీ శ్రీభరత్ ప్రకటించారు. రాబోయే ఐదేళ్లలో మరిన్ని అభివృద్ధి పనులు విశాఖపట్నం డివిజన్‌లో చేపడతామని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి రోజూ బయలుదేరే రైళ్ల సంఖ్య ప్రస్తుతం 37గా ఉంది. దీనిని వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేస్తామంటున్నారు. అంటే 74 అవుతాయి. డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలకు విశాఖపట్నం నుంచి కొత్త రైళ్లు అందుబాటులోకి వస్తాయి. బెంగళూరు, సికింద్రాబాద్, తిరుపతి, చెన్నై, అహ్మదాబాద్, ముంబై, ఢిల్లీ, కోల్‌కత్తా, రాయపూర్‌తో పాటు అరకులోయ వంటి పర్యాటక ప్రాంతాలకు అదనపు రైళ్లు వస్తాయి. కాశీ వంటి పుణ్యక్షేత్రాలకు కూడా రైళ్లు వచ్చే అవకాశం ఉంది. తిరుపతి, బెంగళూరులకు వందేభారత్ వేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. అవన్నీ సాకారమవుతాయి. విశాఖపట్నం రైల్వేస్టేషన్ బిజీగా మారింది. లైన్ల సంఖ్య పరిమితంగా ఉండడంతో కొన్ని రైళ్లు దువ్వాడ దాటిన తరువాత అవుటర్‌లోనే ఉండిపోతున్నాయి. మరికొన్ని రైళ్లను ఒకటి, రెండు రోజుల తరువాత షెడ్యూల్ చేయాల్సి ఉంటోంది. అటువంటి సమయంలో వాటిని నిలిపి ఉంచడానికి సరైన వసతి లేక శివారు మార్గాల్లో ఏ లైన్ ఖాళీగా ఉందో చూసుకొని అక్కడ ఉంచుతున్నారు. దీనివల్ల మెయింటెనెన్స్ ఇబ్బందిగా ఉంటోంది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా కొత్తవలస-అనకాపల్లి మార్గంలో జగన్నాథపురాన్ని శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని అధికారులు ప్రతిపాదించారు. అక్కడ మెగా కోచింగ్ మెయింటెనెన్స్ డిపోతో పాటు లార్జ్ స్కేల్ కాంప్లెక్స్ ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. దీనికి రూ.2,800 కోట్లతో ప్రతిపాదనలు రైల్వే బోర్డుకు పంపించారు. ఇది మాత్రమే కాకుండా విశాఖలో యార్డును ఆధునీకీకరించడానికి డీపీఆర్ రూపొందించారు. అందులో ఐదు కొత్త లైన్లు, అదనంగా పాసింజర్ ప్లాట్‌ఫారాలు, పది స్టేబిలింగ్ లైన్లు, ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ వంటి సదుపాయాలు కల్పించాలని బోర్డుకు ప్రతిపాదించారు. వీటితో పాటు ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్, ఫ్లైఓవర్లు, బైపాస్‌లు నిర్మించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. ఇవన్నీ పూర్తయితే వందలాది మందికి ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయని అధికారులు చెబుతున్నారు.

## టెక్కలి డివిజన్‌లోకి నందిగాం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లా రెవెన్యూ పరిపాలనలో కీలక మార్పు చోటుచేసుకుంది. పరిపాలనా సౌలభ్యం, ప్రాంతీయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నందిగాం మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్ నుంచి తొలగించి టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం తుది నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ జీవోను జారీ చేశారు. ఈ సవరణ బుధవారం నుంచే అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. నందిగాం చేరికతో టెక్కలి రెవెన్యూ డివిజన్ పరిధి 10 మండలాలకు పెరిగింది. ఇందులో టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట, కొత్తూరు, హిరమండలం, లక్ష్మీనర్సుపేట, నందిగాం మండలాలు ఉన్నాయి. పలాస డివిజన్ ఏడు మండలాలకు పరిమితమైంది. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, కంచిలి, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలు ఈ డివిజన్‌లో ఉన్నాయి. శ్రీకాకుళం డివిజన్‌లో 13 మండలాలు యథాతథంగా కొనసాగుతాయి. ఇందులో శ్రీకాకుళం, గార, ఆమదాలవలస, పొందూరు, సరబుజ్జిలి, బూర్జ, నరసన్నపేట, పోలాకి, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం, జలుమూరు మండలాలు ఉన్నాయి.

## సీపీఎం నాయకుడుపై పెట్టిన కేసులు రద్దు చేయాలి



**నక్కపల్లి, పతాకం న్యూస్:** సిపిఎం అప్పలరాజు పై పెట్టినటు వంటి పీడి ఎఫ్ రద్దు చేసి తక్షణం విడుదల చేయాలని సిపిఎం ఆధ్వ ర్యంలో రాజయ్యపేట గ్రామంలో 9వ రోజు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది . ఈ సంద ర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మైలపల్లి మహేష్ బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటం చేస్తున్న ప్రజా నాయకుడిపై పిడిఎఫ్ పెట్టి నిర్బంధించడం పచ్చి దుర్మార్గమని, ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన చేసి బే షరతుగా విడుదల చేయాలని , ఆయన జైలులో ఉన్నంతసేపు రాజకీయ ఖైదీగా గుర్తించి అన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోడా కాశీరావు, వై.చిట్టియ్య,పి.కన్నయ్యమ్మ, బి.నూకలమ్మ,బి.పార్వతి, వై.జగమని, డి.నూకమ్మ వై.కోర్లయమ్మ,పి.కాంతం, అమ్మాజీ,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో చంద్రబాబు విశేష కృషి: రాజారావు



**గాజువాక, పతాకం న్యూస్ :** విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గం 71వ వార్డు పరిధిలో ఉన్న పెన్షన్లు దారు లకు ఒక రోజు ముందుగానే సచివాలయ సిబ్బంది ద్వారా స్థానిక నాయకులు పప్పు రాజారావు మరియు వార్డు కూటమి నాయకులు ఇంటిం టికి వెళ్లి ఎన్టీఆర్ బరోసా పెన్షన్ల నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పప్పు రాజారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ,దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకిచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న విధానాలను గమనించవలసినదిగా కోరారు. కేవలం పెన్షన్లుకి 50వేల కోట్లు, నాలుగు కోట్ల మందికి అన్నా క్యాంటీన్ల ద్వారా బోజన సదుపాయం,తల్లికి వందనం 10వేల కోట్లు, అన్నదాత సుఖీభవ కింద 6,310 కోట్లు, 3.25 కోట్ల మహిళలకు ఉచిత బస్సు ప్రయాణము కల్పించడం టిడిపి ఘనత అన్నారు.రాష్ట్రములో ఉన్న రహదారుల నిర్మాణము, అమరావతి పోలవరం ప్రాజెక్టు , బడుగు బలహీన వర్గాల వారికి గ ృహ నిర్మాణం ,యువతకు ఉద్యగ అవకాశం మున్నగు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం జరుగుతుంది అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పరిశీలకులు,వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు అన్నారు.రాజకీయ పార్టీలకు అతీతంగా రోజుకు పదహారు గంటలు పనిచేస్తున్న నారా చంద్రబాబు నాయుడు పని విధానాన్ని, దేశ ప్రధాని నరేంద్ర మోదీ అభినందించడం చంద్రబాబు నాయుడు పై నమ్మకంతో ప్రపంచ స్థాయిలో వివిధ దేశాలనుంచి ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు తీసుకుని రావడంలో చంద్రబాబు విజయము సాధించారన్నారు. మంచి ప్రభుత్వం గా గుర్తింపు తెచ్చుకుంటున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు అభిమానించవలసిన అవసరము ఉంది అని పప్పు రాజారావు అన్నారు.ఈ కార్యక్రమములో వార్డు నాయకులు వై. మోహన్ రావు , కొరికిన చంద్రరావు , కొండా వెంకటేష్,శీల రామారావు, నక్కా రాజారావు ,బోండా అప్పారావు,రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనే ధ్యేయం




**ఎచ్చెర్ల, పతాకం న్యూస్:** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభు త్వం పనిచేస్తోందని ఎమ్మె ల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. ఎచ్చెర్లలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 14 సంస్థలు పాల్గొనగా, 311 మందికి ని యామకపత్రాలు అందజేశా రు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికు మార్, ఎన్‌వైకే డిప్యూటీ డైరెక్టర్ ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈవో అప్పలనా యుడు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, బుడుమూరు శ్రీరా మ్మూర్తి, ఎన్‌సీవీ రమణమూర్తినాయుడు పాల్గొన్నారు.

## గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి



**సోంపేట, పతాకం న్యూస్:** గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, మాజీ మంత్రి గౌతు శివాజీ తెలిపారు. పట్టణంలో అభ్యుదయ సైకిల్‌యాత్ర నిర్వహించా రు. ఈసందర్భంగా మాట్లాడు తూ మత్తుపదార్థాలకు బానిస కావడం వల్ల ఆరోగ్యంతోపాటు ఆర్థికంగా కూడా కుటుంబాలు నాశనం అవుతున్నాయని తెలి పారు. ర్యాలీలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటుసంస్థల విద్యార్థులు, వివిధ వర్గాల వ్యాపారులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, సీఐ మంగరాజు, ఎస్ఐ లోవరాజు, పారినాయుడు పాల్గొన్నారు.

## గదబపాలెంలో ఎన్టీఆర్ పెన్షన్లు పంపిణీ



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,కొయ్యూరు మండలం గదబపాలెం పంచాయతీ పరిధిలో బుధవారం ఎన్టీఆర్ పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొని పింఛన్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి యాళ్ళ నాగేష్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ పింఛన్ పథకం వ ృద్ధులకు, నిరుపేదలకు ఎంతో ఉపశమనం కలిగిస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు మారా మత్సకొండ, గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు సమరెడ్డి నూకరాజు,ప్రధాన కార్యదర్శి ఎం. తలుపుల నాయుడు,కమిటీ సభ్యులు వై. తలుపులయ్య,మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.పింఛన్ అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి క ృతజ్ఞతలు తెలిపారు.

## భక్తజన సముద్రంగా ఉపమాక వెంకన్న ఆలయం

**నక్కపల్లి, పతాకం న్యూస్ :** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతము పై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారి ఆలయం ముక్కోటి ఏకాదశి (వైకుంఠ శుద్ధ ఏకాదశి) పర్వదినం సందర్భంగా భక్తజన సముద్రంగా కనిపించింది. తెల్లవారుజామున మూడు గంటలకు కొండపై గల మూలవిరాట్ కు ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో పంచామ ృత అభిషేకము నిత్య పూజా కార్యక్రమములు నిర్వహించిన తర్వాత రాత్రి 8 గంటల వరకు భక్తులందరికీ సర్వదర్శనము కల్పించారు. కొండ దిగువున గల ఆలయ నారద మహాముని ప్రతిష్టితమైన ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి వారి సన్నిధిలోను ఉపాలయములలోను నిత్య పూజలు నిర్వహించారు.

## వారంరోజులపాటు రథసప్తమి వేడుకలు




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న రథసప్తమి వేడుకల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయంతీసుకుంది. స్వామివారిని దర్శించుకునేందుకు లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని, వారి మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటివరకు మూడు రోజులుగా ఉన్న ఉత్సవాలను ఏడు రోజులు నిర్వహించేం దుకు వీలుగా ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో-291 ప్రకారం రథసప్తమిని రాష్ట్ర పండుగగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న విషయం విదితమే. మూడు రోజుల వ్యవధి లక్షలాది మంది భక్తుల తాకిడికి సరిపోవడం లేదని, ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ దేవదాయశాఖ కమిషనర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించిన ప్రభుత్వం ఇకపై ఈ వేడుకలను సిక్కోలు రథసప్తమి ఉత్సవాలు పేరిట ఏడురోజుల పాటు జరిపేందుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ డాక్టర్ ఎం.హరి జవహర్ లాల్ పేరుతో మంగళవా రం జీవో -513 విడుదలైంది. తాజా ఆదేశాలకు అనుగుణంగా తదుపరి ఏర్పాట్లు, చర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖ కమిషనర్, అరసవల్లి ఆలయ కార్య నిర్వహణాధికారిని ప్రభుత్వం ఆదేశించింది.

## బాడీ బిల్డింగ్ పోటీలు విజేతలను అభినందించిన కోలగట్ల



**విజయనగరం, పతాకం న్యూస్:** డిసెంబర్ 28న చెన్నై నగరంలో ఘనంగా నిర్వహించిన సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ కాంపిటీషన్లో విజయనగరం జిల్లాకు చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బుధవారం నాడు ఆయన నివాసంలో విజయం సాధించిన క్రీడాకారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వీరిలో 80 కేజీల కేటగిరీలో అదుతేమైన ప్రదర్శనతో బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయిలో తన సత్తా చాటిన విజయనగరంకు చెందిన ఎస్.కె. సుభాన్, అదే విధంగా జి. రమేష్ 55 కేజీల కేటగిరీలో నాలుగవ స్థానంలో నిలిచినవారు ఉన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయనగరం పేరు మార్మోగేలా క ృషి చేసిన క్రీడాకారుల పట్టుదల, శ్రమ ప్రశంసనీయమని ఆయన అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే విజయనగరం జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కనకల క ృష?, సెక్రటరీ బైక్ రమేష్ కూడా విజేతలను అభినందిస్తూ, జిల్లా నుంచి ఇలాంటి ప్రతిభావంతులు ముందుకు రావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. క్రీడాకారులకు అసోసియేషన్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ విజయాలతో విజయనగరం జిల్లా బాడీ బిల్డింగ్ రంగంలో మరోసారి తన సత్తాను నిరూపించిందని హర్షం వ్యక్తం చేశారు.

## ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న బొంజుబాబు

**హుకుంపేట, పతాకం న్యూస్:** హుకుంపేట మండలంలోని కోట్నాపల్లి పంచాయతీలో ని గ్రామాల్లో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు శతక బొంజు బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొంజు బాబు మాట్లాడుతూ నూతన సంవత్సర సందర్భంగా ముందు రోజే వ ృద్ధులు, వితంతువులు, వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను పంపిణీ కార్యక్రమం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కోట్నపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సాంబె బాబురావు, బీజేపీ ఎంపీటీసీ సాంబె బాలక ృష?, టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ కూడేలి నూకరాజు, ఏఎంసి డైరెక్టర్ ఏడే చిట్టిబాబు,భూత్ ఇంచార్జి కిరీసాని వెంకట్రావు బూత్ కో కన్వీనర్ పొట్టంగి పద్మ పొట్టంగి లక్ష్మయ్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'పినాక' దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ పరీక్ష విజయవంతం



**ఒరస్సా:** ఒరిస్సాలోని చాందీపూర్‌లో ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటిఆర్) వద్ద పినాక దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ (ఎల్ఆర్జిఆర్-120) తొలి పరీక్షని డిఆర్‌డిఓ విజయవంతంగా నిర్వహించింది. 120 కిలోమీటర్ల దూరంలో గల లక్ష్యాలను ఛేదించగల ఈ ప్రయోగం విజయవంతమైన రోజునే భారత సైన్యంలోకి తీసుకోవడానికి ఆమోదముద్ర కూడా లభించింది. సోమవారం మధ్యాహ్నం సమావేశమైన రక్షణ సేకరణ మండలి (డిఎసి) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. పరీక్ష సందర్భంగా రాకెట్‌ను గరిష్ట రేంజ్‌లో 120 కిలోమీటర్ల దూరానికి ప్రయోగించారు. ప్రణాళిక ప్రకారం రూపొందించిన అన్ని విన్యాసాలను విజయవంతంగా పూర్తి చేసిన డిఆర్‌డిఓను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. సైన్యంలోకి దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్లను విజయవంతంగా మోహరించడం వల్ల సాయుధ బలగాల సామర్థ్యాలు గణనీయంగా పెరుగుతాయని పేర్కొన్నారు. డిఆర్‌డిఓ కార్యదర్శి సమీర్ వి.కామత్ ఈ పరీక్షను తిలకించారు. అన్ని లక్ష్యాలను విజయవంతంగా నెరవేర్చిన సిబ్బందిని అభినందించారు.

## బ్యాంకు ఉద్యోగుల నిరసన




**అనంతపురం పతాకం న్యూస్:** బ్యాంకులకు వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని బ్యాంకు ఉద్యోగుల జిల్లా సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న యూనియన బ్యాంకు ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. యూఎఫబీయూ నా యకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బ్యాంకులకు వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని 10 లక్షల మంది ఉద్యోగులు నిరసన చేపట్టారన్నారు. ఆరు రోజులపాటు పనిచేయడంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. సమస్య పరిష్కరించని ప క్షంలో ఆందోళన ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ శంకర్, చంద్రమౌళి, సునీత, లోహిత, రవీంద్రనాయక్, కిరణ్, పావని, సతీష్‌పాల్గొన్నారు.

## రెవెన్యూ క్లినిక్‌లకు అనూహ్య స్పందన




**ఏలూరు, పతాకం న్యూస్:** రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరిం చేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అను సంధానంగా రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా ప్రత్యేకంగా రెవె న్యూ సమస్యలపై అర్జీల స్వీకరణ ప్రారంభ మైంది. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరం వేదిక గా ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అర్జీలను స్వీకరించారు. దీనికి ముందుగా రిసెప్షన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల అధికారులు నాంచారయ్య, శేషగిరిరావు, రవి కుమార్, చెల్లన్న దొర పర్యవేక్షణలో అర్జీలను పరిశీలించి సక్రమంగా ఉంటే ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆర్డీవో వద్దకు అర్జీదారులను పంపారు. ఆధార్ సమస్యలు తలెత్తిన వారికి ఆధార్ నమోదు, అప్‌డేట్ చేయిం చడానికి ఐరిష్ యంత్రంతో పాటు సిబ్బందిని నియమించారు. నూజివీడు సబ్ కలెక్టరేట్, జంగా రెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయా లతో పాటు జిల్లాలో 27 తహసీల్దార్ కార్యాలయాల వద్ద ప్రత్యేక డెస్క్‌లను ఏర్పాటు చేసి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ క్లినిక్‌లకు వచ్చిన వారికి భోజన ఏర్పాట్లను చేశారు. ఇక ప్రతీ వారం రెవెన్యూ క్లినిక్‌ల నిర్వహణ ఉంటుందని అ?ధికారులు చెబుతున్నారు. ఏలూరు ఆర్డీవో పరిధిలో 30, జంగారెడ్డిగూడెం ఆర్డీవో పరిధిలో 20, నూజివీడు సబ్ కలెక్టరేట్ పరిధిలో ఏడు అర్జీలు వచ్చాయి. ప్రత్యేకించి రెవెన్యూ సమస్యలపై అర్జీల స్వీకరణ వల్ల త్వరితగతిన పరిష్కార మయ్యే అవకాశాలున్నాయి.

## రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

**గుర్ల పతాకం న్యూస్:** అమ్మా.. ఉదయానికల్లా ఇంటికి వచ్చేస్తా.. అని ఓ కొడుకు తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. ఫోన్ చేసిన గంట సమయంలోనే రైలు కింద జారిపడి మృతిచెందినట్టు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా గుర్ల మండలం, గొలగాం గ్రామానికి చెందిన కంది సాయిరాం(26) గత కొంత కాలంగా బెంగు ళూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. తన స్వగ్రామం వెళ్లేందుకు బెంగుళూరులోని రైల్వే స్టేషన్‌కు చేరు కున్నాడు. రైలు ఎక్కే ముందు తల్లిదండ్రులకు, అన్నయ్యకు ఫోన్‌చేసి.. ఉదయా నికి వచ్చేస్తానని చెప్పాడు. తన కొడుకు వస్తాడని ఆ తల్లి ఆత్రుతగా ఎదురు చూసింది. ఉదయాన్నే రామతీర్థంలో గిరి ప్రదక్షిణకు వెళ్తానని కూడా చెప్పినట్టు తల్లి తెలిపింది. ఇంతలోనే చేదు కబురు ఇంటికి చేరింది. రైలు బయలుదేరే సమయంలో రైలు నుంచి జారిపడి మృతిచెందినట్టు ఫోన్ ద్వారా సమాచారం అందింది. దీంతో ఇళ్లంతా ఒక్కసారిగా విషాధంలో మునిగిపోయింది. మృతుడికి తల్లిదండ్రులు కంది విశ్వనాథం, అప్పలనరసమ్మతో పాటు అన్నయ్య, చెల్లి ఉన్నా రు. అన్నయ్యకి, చెల్లికి పెళ్లిళ్లు అయ్యాయి. సాయిరాంకు వచ్చే సంవత్సరం పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ఆలోచనలో ఉన్న తరుణంలో ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని తీసుకురా వడానికి కొంతమంది బంధువులు బెంగుళూరు బయలుదేరి వెళ్లారు.

# మూలన పడిన తిరుపతిలో స్మార్ట్‌సిటీ!



**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుపతిలో స్మార్ట్‌సిటీ మూలన పడింది. తిరుపతి నగరపాలక సంస్థ ఆర్థిక సుస్థిరత సాధించే లక్ష్యంతో కేంద్రం దీన్ని ప్రకటించింది. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించినా తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ఐదేళ్లలో రాష్ట్రం వాటా కింద పైసా కూడా విడుదల చేయలేదు. అప్పటికే ఖాతాల్లో ఉన్న సొమ్ములనూ ఊడ్చేసింది. దీంతో ప్రాజెక్టులన్ని అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రస్తుతం వాటి పనుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కేంద్రం స్మార్ట్‌సిటీ పథకాన్ని రద్దు చేయడంతో ఆ ప్రాజెక్టులన్నీ దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అసంపూర్తి పనులు చేయడానికి రూ.405 కోట్లు అవసరం. టీటీడీ నుంచి స్మార్ట్‌సిటీ పథకానికి రావాల్సిన రూ.53 కోట్లు కూడా అందలేదని తెలుస్తోంది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ రూ.180 కోట్లు, సిటీ ఆపరేషన్ సెంటర్ రూ.94.50 కోట్లు, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సెంటర్ రూ.52.50 కోట్లు, రూ.30 కోట్లతో నిరంతర నీటి సరఫరా తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు, వినాయకసాగర్‌లో అదనపు అంతస్తులు, కూరగాయల మార్కెట్, వ్యాయామశాల, విద్యుత్ దీపాలంకరణ ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయి. గొల్లవానిగుంట పునరుద్ధరణ పనులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల వినాయకసాగర్‌లో రూ.3 కోట్ల విలువైన ఈత కొలను, గ్లోగార్డెన్ పనులు పూర్తి చేశారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు పూర్తి చేయడం అసాధ్యమని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఒక్కో ప్రాజెక్టు నుంచి అధికారులు తప్పుకొంటున్నారు. తూకివాకంలో రూ.22 కోట్లతో చేపట్టిన 6 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తి కాగా ఇప్పటికే రూ.14.30 కోట్లు బిల్లులు కూడా చెల్లించారు. పనులు చేయడంలో గుత్తేదారు నిర్లక్ష్యంతో టెండరు రద్దు చేశారు. కరకంబాడి రోడ్డులో రూ.2 కోట్లతో కూరగాయల మార్కెట్ నిర్మాణం ప్రాజెక్టు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గుత్తేదారు టెండరు రద్దు చేశారు. గొల్లవానిగుంటలో వద్ద రూ.2 కోట్ల స్టేడియం, రూ.2 కోట్ల క్రికెట్ మైదానాన్ని స్మార్ట్‌సిటీ నుంచి శాప్‌నకు అప్పగించారు. వినాయకసాగర్‌లోని రూ.1.76 కోట్ల విలువైన మల్టీపర్పస్ హాల్, రూ.2 కోట్ల విలువైన యోగా కేంద్రం, రూ.1.86 కోట్ల చిన్నారుల ఆటస్థలం ప్రాజెక్టులను రద్దు చేసినట్లు తెలుస్తోంది. దేశం ఆర్థికంగా పరిపుష్టం కావడానికి అక్కడి పట్టణాలే తోడ్పడతాయి. మన స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో 42శాతం యాభై ప్రధాన నగరాల నుంచే వస్తోంది. ఇలాంటి స్మార్ట్ సిటీస్‌ని నిర్లక్ష్యం చేయడంతో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసపోయే వారిలో సగంమంది ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల నుంచే వస్తున్నారు. దేశంలోని పది అగ్ర నగరాల్లో ఒక్కటి కూడా ఈ నాలుగు రాష్ట్రాల్లో లేకపోవడాన్ని ఇక్కడ గమనించాలి. ఈ నాలుగు రాష్ట్రాలు అత్యధిక పేదరికంతో మానవాభివృద్ధి సూచీలో బాగా వెనకబడిపోయాయి. వాటిలోని ప్రధాన నగరాలను మహా నగరాలుగా అభివృద్ధి చేస్తే, అక్కడ ఆర్థిక కార్యకలాపాలు జోరందుకుని స్థూల ఉత్పత్తి పెరుగుతుంది. దానివల్ల ఆర్థిక అసమానతలు తొలగిపోవడమే కాకుండా, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన సమస్య తప్పుతుంది. అయితే ఇందుకోసం ఆయా నగరాల్లో నాణ్యమైన మౌలిక వసతులను సమకూర్చడం, నిపుణ మానవ వనరులను తయారు చేసుకోవడంతో పాటు క్రియాశీలక పెట్టుబడి విధానం కూడా అత్యంత కీలకమవుతుంది. ఈ నేపథ్యంలో స్మార్ట్ సిటీలను పూర్తి చేస్తేనే ప్రజలకు మంచి జరుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

## రహస్యంగా కోడికత్తుల తయారీ - 2 వేల కోడి కత్తులు స్వాధీనం

**ఎన్టీఆర్ జిల్లా, పతాకం న్యూస్:** సంక్రాంతి సమీపిస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల రహస్యంగా కత్తులు తయారవుతున్నాయి. బరుల్లో పందేలకు దిగే కోళ్లకు వీటిని కడతారు. కత్తులకు పదును పెట్టేందుకు చాలాచోట్ల గదులు అద్దెకు తీసుకుని యంత్రాలతో పనిచేస్తున్నారు. పెద్ద సంఖ్యలో వీటి కోసం ఆర్డర్లు వస్తున్నాయి. ఇటువంటి కేంద్రాలపై ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు బృందాలుగా విడిపోయి మొత్తం ఆరుచోట్ల దాడులు చేసి కత్తులు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసుల నమోదుకు స్థానిక పోలీసుస్టేషన్లలో నిందితులను అప్పగించారు. ఆర్డర్లపై రహస్యంగా తయారీ: విస్సన్నపేటలో నడకుదురు సర్వేశ్వరరావు ఓ గదిని అద్దెకు తీసుకుని ఐదు యంత్రాలతో సంక్రాంతి కత్తులకు పదునుపెడుతున్నాడు. పోలీసులు ఇతడిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1,600 కత్తులు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అతని నుంచి రూ.47,530 నగదును సీజ్ చేశారు. అంతేకాకుండా రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని అంపాపురంలో విజయబాబు నుంచి 600 కత్తులు, ఓ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. మైలవరంలో సుంకర కిశోర్ నుంచి దాదాపు 350 కత్తులు, ఒక యంత్రాన్ని, సుంకర నరేంద్ర నిరంజన్‌రావు నుంచి 70 కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నంలో వల్లభాపురం నాగరాజు నుంచి 300 కత్తులు, జి.కొండూరు మండలం చెవిటికల్లులో వెంకటనాగాచారి నుంచి 164 కత్తులు, ఒక యంత్రాన్ని దాడులలో సీజ్ చేశారు. కత్తులకు పదును పెడుతున్న వీరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా ఏలూరు నూజివీడుతో పాటు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో కోడికత్తులు తయారవుతున్నట్లు తేలింది. వీటిని ఆర్డర్ల మేరకు నిందితులు కొనుగోలు చేసి కత్తులకు పదును పెట్టి అమ్ముతుంటారు. ఒకవేళ అలా కాని పక్షంలో ఎవరైనా కొనుగోలు చేసి తీసుకొస్తే పదునుపెట్టి ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో తయారీ కేంద్రాలపై పోలీసులు నిఘా పెట్టారు. త్వరలో వీటిపై దాడులు చేసే అవకాశం ఉంది. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలోని విస్సన్నపేటలో వికాస్ నగర్ వద్ద టాస్క్ ఫోర్స్ అధికారుల దాడులు చేశారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు 2,000 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె. గిరిబాబు తెలిపారు. కోడి పందేలపై హైకోర్టు ఆంక్షలున్నా పట్టించుకోకుండా కోస్తా జిల్లాల్లో పెద్దఎత్తున కోడి పందేల బరులు ఏర్పాటు చేశారు. కృష్ణా జిల్లాలోని గన్నవరం నియోజకవర్గంలో అంపాపురంలో జాతీయ రహదారి పక్కనే పందేల నిర్వహణ జాతరను తలపించింది. ముఖ్యంగా బరి చూట్టూ సీఎం జగన్ చిత్రాలతో బ్యానర్లు, వైఎస్సార్‌సీపీ జెండాలతో నింపేశారు. ఎమ్మెల్యే



వల్లభనేని వంశీ కనుసన్నల్లో, ఆయన అనుచరుడి ఆధ్వర్యంలోనే ఈ బరిని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. క్యాసినో నిర్వాహకుడు చీకోటి ప్రవీణ్‌తోనూ ఈ వైఎస్సార్‌సీపీ నాయకుడికి సంబంధాలు ఉన్నాయనీ, నెల రోజుల కిందట కలిసి వచ్చారని సమాచారం. పోలీసులు మాత్రం అంపాపురం వైపు చూడటానికి సాహసించడం లేదు.

అంపాపురం బరిలో తొలిరోజే కనీసం రూ. 10-15 కోట్ల రూపాయల మేరకు పందేలు నడిచినట్లు అంచనా వేస్తున్నారు. వీఐపీ, వీవీఐపీల కోసం ఏసీ శిబిరాలను ఏర్పాటు చేసి వాళ్ల దగ్గరకే మద్యం, ఆహారం వంటివి అందిస్తున్నారు. వీఐపీల బరిలో తొలి పోటికే నిర్వాహకులు రూ.5 లక్షలను పెట్టగా, పందెం రాయుళ్లు రూ.15 లక్షల వరకు కాశారు. అక్కడి నుంచి ప్రతి పోటికీ కనీసం రూ.20 లక్షల వరకు పందేలు జరిగాయి. ఒక్క అంపాపురం బరిలోనే తొలిరోజు 20కి పైగా పోటీలు జరగ్గా, సుమారు రూ.4 కోట్ల వరకు పందేలు కాసినట్లు తెలుస్తోంది. ప్రధాన బరులతో పాటుగా 15 నుంచి 20 చిన్న కోడి పందేల బరులు ఏర్పాటు చేశారు. వాటిలోనూ లక్షల రూపాయల్లో పందేలు సాగాయి. ఈ బరిలో రాత్రి సమయంలో ప్రత్యేకంగా బుల్లెట్ కోడి పందేల కోసం ఏర్పాటు చేశారు.




## పోలీసు సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఎస్పీ దామోదర్ తెలిపారు. జిల్లా పోలీ సు కార్యాలయంలో పోలీసు ఉద్యోగుల కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా వారి ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు జిల్లా పోలీసు ఉద్యోగులు క్రెడిట్ సొసైటీ ఏర్పాటైందన్నారు. తక్కువ వడ్డీతో సొసై టీ ద్వారా రుణాలు పొందే పోలీసు ఉద్యోగులు తమ ఆర్థిక అవసరాలను తీర్చుకోగలుగుతున్నారన్నారు. 2024-25 సంవత్సరానికి వచ్చిన ఆదాయ, వ్యయాలు సభ్యులు వివరించారు. సర్వీసు ఆధారంగా ఇప్పటికే రూ.3లక్షల నుంచి రూ.5.లక్షల వరకూ వ్యక్తిగత రుణా లుగా ఆడపిల్లల వివాహాల నిమిత్తం రూ.8లక్షలు అందిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ కోటిరెడ్డి, ఎస్‌బీ సీఐలు లీలారావు, విద్యాసాగర్, ఆర్ఐలు గోపాలనాయుడు, రమేష్‌తో పాటు కో-ఆపరేటివ్ కార్యదర్శి నీలకంఠం నాయుడు, డైరక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

# 'ఫ్యాబ్రిక్ కండిషనర్లు' వాడుతున్నారా?

ఉతికిన దుస్తులు మరింత తాజాగా ఉండాలని, సువాసన వెదజల్లాలని ఫ్యాబ్రిక్ కండిషనర్లను ఉపయోగిస్తాం. అయితే అవి ఎంత సురక్షితమనే విషయాన్ని మాత్రం పట్టించుకోం. వాటితో ప్రమాదకరమైన రసాయనాలు శరీరంలోకి వెళతాయని, ఆరోగ్య సమస్యలు వస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఫ్యాబ్రిక్ కండిషర్ వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం! ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్లలోని కాటియోనిక్ సర్ఫెకెంట్లు దుస్తులను మృదువుగా మారుస్తాయి. కానీ, వాటిలోని క్వాటర్నరీ అమ్మోనియం సమ్మేళనాలు , సింథటిక్ ఫ్రాగ్రెన్స్, సిలికాన్స్, వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ తదితరాల వల్ల ఆస్తమా, అలర్జీ ఇతర శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. వీటి నుంచి వచ్చే సువాసన పీల్చడం వల్ల దీర్ఘకాలిక బ్రాంకైటిస వచ్చే ప్రమాదముంది. కొందరిలో శ్వాస ఆడకపోవడం, తల తిరగడం, తలనొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. తొలి దశలో ఈ లక్షణాలను గుర్తించలేక, రోజువారీ అలసట లేదా ఒత్తిడిగా తోసిపుచ్చుతారు. పిల్లలు, సున్నితమైన చర్మం ఉన్నవారిలో వాపు, దురద, దద్దుర్లు వంటివీ వస్తాయంటున్నారు నిపుణులు. సువాసన-సంబంధిత సాంద్రత పెరగడం వల్ల తలనొప్పి, ఉబ్బసం దాడులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, హృదయ, నాడీ సంబంధిత సమస్యలు, శ్లేష్మ పొర చికాకు, కాంటాక్ట్ డెర్మటైటిస్ వంటి ప్రతికూల చర్మ, శ్వాసకోశ సమస్యలు వస్తాయని అధ్యయనం పేర్కొంది. ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్లు ఇథనాల్, క్లోరోఫామ్, బెంజైల్ అసిటేట్ వంటి వీఓసీలను విడుదల చేస్తాయి. ఇవి వాయునాళాలు, ఊపిరితిత్తులకు వాయునాళాలకు నష్టం చేస్తాయి.




కొన్ని వీఓసీల వల్ల దీర్ఘకాలంలో రోగనిరోధక శక్తి తగ్గడం, నరాలు దెబ్బతినడం, థైరాయిడ్, క్యాన్సర్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదముంది.

సువాసన కోసం వినియోగించే కృత్రిమ కారకాల్లో 'థాలేట్లు' అనే ప్రమాదకరమైన రసాయనాలుంటాయి. ఇవి టెస్టోస్టిరాన్, ఈస్ట్రోజన్ స్థాయిలను దెబ్బతీస్తాయి. దీంతో సంతానోత్పత్తి సమస్యలతో పాటు మానసిక ఆరోగ్యం ప్రభావితమయ్యే ప్రమాదముందని అధ్యయనం పేర్కొంది.

మెటబాలిజంపై (జీవక్రియ) ప్రభావం చూపడం ద్వారా బరువు పెరగడం, ఇన్సులిన్ నిరోధకతకు కారణమవుతాయి. చాలా కంపెనీలు సాఫ్ట్‌నర్స్‌లో ఉపయోగించే పదార్థాలను వెల్లడించట్లేదు. దీంతో వాటిలో ఏవి ఉపయోగిస్తారో బయటకు తెలియడం లేదు. వాటికి బదులుగా సహజ పదార్థాలు ఎంపిక చేసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఫాబ్రిక్ సాఫ్ట్‌నర్లలోని థాలేట్లు, ఇతర రసాయనాలు ఇంట్లోని గాలిలో పేరుకుపోతాయి. ఇవి నెలల తరబడి వాయు కాలుష్యానికి కారణమవుతాయి.

వీటి వల్ల దుస్తులపై మైనపు పూతను వదులుతాయి. ఇవి పరుపులు, ఫర్నిచర్, చర్మంపైకి చేరతాయి. నీటిని శోషించుకునే గుణాన్ని తగ్గిస్తాయి. దుస్తులపై ఉన్న సిలికాన్ అవశేషాలు పూర్తిగా తొలగిపోవడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. ఆ దుస్తులు వేసుకున్నప్పుడు వాటిపై మిగిలి ఉన్న అవశేషాలు చర్మంపైకి చేరే ప్రమాదముంది.

ఇవి ఎసిటాల్డిహైడ్, ఫార్మాల్డిహైడ్ తదితర కాలుష్య కారకాలను మారుస్తాయి. ఇవి అనేక ఆరోగ్య సమస్యలను కారణమవుతాయి. ఈ ప్రమాదకరమైన రసాయనాలు సులభంగా విచ్ఛిన్నం కావు. సరస్సులు, నదులు, సముద్రాల్లోకి చేరి జలచరాలకూ హాని కలిగిస్తాయి. వీటి అవశేషాలు మట్టిలో కూడా అంత త్వరగా కలిసిపోవు. ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్లు 1960 సంవత్సరంలో మార్కెట్లోకి వచ్చాయి. అప్పుడు లాండ్రీ డిటర్జెంట్లలో కాఠిన్యత ఎక్కువగా ఉండేది. ఇప్పుడు అందుబాటులో ఉన్న డిటర్జెంట్లు తేలికపాటివి. వీటికి ఫాబ్రిక్ కండిషనర్లు అవసరం లేదని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.

సువాసనలు ఉత్పత్తి చేయడానికి వాటిలో సంక్లిష్టమైన రసాయన మిశ్రమాలు వాడుతారు. వాటిలో కొన్ని మాత్రమే సహజ పదార్థాలు. చాలా ఫ్రాగ్రెన్స్ ప్రయోగశాలలో పెట్రోలియం ఆధారిత సమ్మేళనాల నుంచి తయారవుతాయి.

దుస్తులు ఉతికిన తర్వాత ఈ రసాయనాలు ఆవిరైపోవు. దుస్తులకు అంటుకుని, రోజుల తరబడి తాజా సువాసన ఇచ్చేలా తయారు చేస్తారు. సువాసన ఎక్కువ సేపు ఉంచేలా తరచూ వాడే రసాయనాల్లో థాలేట్‌లు ఒకటి. ఇందులో సువాసన కలిగించే అణువులు త్వరగా విచ్ఛిన్నం కాకుండా అడ్డుకుంటాయి. ప్రమాదకరమైన రసాయనాలకు బదులుగా దుస్తుల సువాసన కోసం సహజ పదార్థాలు వినియోగించవచ్చు. వైట్ వెనిగర్ వాడటం వల్ల దుస్తులు మృదువుగా మారతాయి. దుర్వాసన, అవశేషాలు లాంటివి తొలగిపోతాయి. అవసరమైతే బేకింగ్ సోడా వినియోగించవచ్చు.

ఉన్నితో చేసిన డ్రయర్ బాల్స్ దుస్తులను మృదువుగా మారుస్తాయి. వీటికి కొన్ని చుక్కల స్వచ్ఛమైన ఎసెన్షియల్ ఆయిల్స్ చేరిస్తే సహజ సువాసనలు వస్తాయి. ప్లాంట్ బేస్డ్ డిటర్జెంట్లు వినియోగిస్తే హానికరమైన రసాయనాలు లేకుండా దుస్తులు శుభ్రంగా, మృదువుగా మారతాయి.

# చుండ్రుతో ఇబ్బంది పడుతున్నారా?

చలికాలంలో చుండ్రు సమస్య వేధిస్తుంటుంది. చర్మ సౌందర్యానికి ఎన్నో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. మాయిశ్చరైజర్ రాసుకొన్నప్పటికీ చర్మం పొడిబారిపోవడం, పెదవులు పగలడం, పాదాల పగుళ్లు లాంటి సమస్యలు వస్తుంటాయి. ఇలా చర్మం విషయంలో మాత్రమే కాదు, జుట్టు విషయంలో కూడా శీతాకాలంలో కొన్ని సమస్యలు తప్పవు. అలాంటి వాటిల్లో ఎక్కువగా వేధించే సమస్య చుండ్రు. ఈ కాలంలో చర్మం మాదిరిగానే కుదుళ్ల భాగం కూడా పొడిగా తయారవుతుంది. దీంతో చుండ్రు వస్తుంది. దీని కారణంగా జుట్టు రాలిపోవడం మాత్రమే కాదు తలలో దురద, ముఖంపై చిన్న చిన్న మొటిమలు వంటివి కూడా వస్తాయంటున్నారు నిపుణులు. అయితే, కొన్ని చిట్కాలు పాటిస్తే చుండ్రు సమస్యను వదిలించుకోవచ్చని చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

చలికాలంలో సౌందర్య సంరక్షణ విషయంలో నూనెలు కీలకపాత్ర పోషిస్తుంటాయి. అందుకే కొంతమంది రాత్రివేళల్లో మాయిశ్చరైజర్?కి బదులుగా నూనెలను ఉపయోగిస్తుంటారు. నూనెల్లో ఉండే ఫ్యాటీ ఆమ్లాలు కుదుళ్లను పొడిబారకుండా చేస్తాయంటున్నారు నిపుణులు. దీంతో చుండ్రు సమస్య తగ్గుముఖం పడుతుందని చెబుతున్నారు. దీనికోసం కొబ్బరి, బాదం, ఆలివ్ వంటి నూనెల్లో ఏదో ఒకదానితో లేదా వాటి మిశ్రమాన్ని తీసుకొని గోరువెచ్చగా వేడిచేయాలంటున్నారు. ఆ నూనెతో మాడును బాగా మర్దన చేసుకోవాలని, ఆ తర్వాత ఒక గంట సేపు అలా వదిలేయాని పేర్కొంటున్నారు. దీనివల్ల కుదుళ్లు నూనెను పీల్చుకొంటాయని తెలియజేస్తున్నారు. ఆ తర్వాత గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తల స్నానం చేస్తే సరిపోతుందని సలహా ఇస్తున్నారు. ఇలా వారానికి రెండు నుంచి మూడు సార్లు పాటించడం ద్వారా మంచి ఫలితాన్ని పొందవచ్చని సూచిస్తున్నారు. అయితే, శీతాకాలంలో మనం ఉపయోగించే కొన్ని షాంపూలు కూడా చుండ్రు రావడానికి కారణమవుతుంటాయంటున్నారు. కాబట్టి చుండ్రు సమస్య ఉన్నట్లయితే షాంపూల వాడకం విషయంలో సంబంధిత డాక్టర్‌ను సంప్రదించడం మంచిదని చెబుతున్నారు. శీతాకాలంలో కుదుళ్లు పొడిబారడం వల్ల చుండ్రుతోపాటు కొంతమందికి తలలో దురద ఎక్కువగా వస్తుంటుంది. దీనికి కలబంద మంచి పరిష్కారం అంటున్నారు నిపుణులు. దీనికోసం కలబంద గుజ్జులో వేపాకుల పొడిని, కొన్ని చుక్కల ఉసిరి నూనెను కలుపుకొని మిశ్రమంగా చేసుకోవాలని చెబుతున్నారు. ఇలా తయారైన మిశ్రమాన్ని మాడుకు అప్లై చేసి 30 నిమిషాల పాటు ఆరనివ్వాలని పేర్కొంటున్నారు. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో గాఢత తక్కువగా ఉండే షాంపూ ఉపయోగించి తలస్నానం చేస్తే సరిపోతుందని పేర్కొంటున్నారు. ఈ చిట్కాను వారానికి రెండు సార్లు చేయడం ద్వారా మంచి ఫలితం ఉంటుందని తెలియజేస్తున్నారు. కలబంద జెల్ యువతులలో చుండ్రును తగ్గించడంలో ప్రభావవంతంగా ఉంటుందని, ఇది చుండ్రు చికిత్సకు సహజ నివారణగా పనిచేస్తుందని ప్రచురించింది.



ఆపిల్ సైడర్ వెనిగర్‌లో సైతం చలికాలంలో వేధించే చుండ్రు సమస్యను తగ్గించే గుణాలున్నాయి. ఇది కుదుళ్ల పీహెచ్ స్థాయులను అదుపులో ఉంచి తలలో ఫంగస్ పెరగనివ్వకుండా చేస్తుందంటున్నారు నిపుణులు. అరకప్పు నీటిలో పావు కప్పు యాపిల్ సైడర్ వెనిగర్‌ను కలుపుకొని, దీన్ని స్ప్రేబాటిల్లో వేసి మాడుపై స్ప్రే చేసుకోవాలని చెబుతున్నారు. ఆ తర్వాత తలకు టవల్ చుట్టి, 15-30 నిమిషాల పాటు ఆరనివ్వాలని పేర్కొంటున్నారు. ఆ తర్వాత తలస్నానం చేస్తే సరిపోతుందని తెలియజేస్తున్నారు. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుందని సూచిస్తున్నారు. ఆపిల్ సైడర్ వెనిగర్ ఒక సహజ యాంటీ ఫంగల్ ఏజెంట్‌గా పనిచేస్తుందని అధ్యయనం పేర్కొంది.

ఇది చుండ్రుకు కారణమయ్యే ఫంగస్, మలాసెజియా ఫర్ఫర్ పెరుగుదలను నిరోధిస్తుందని తెలిపింది.

# ఇమ్మిగ్రేషన్ నిఘాతో వలసదారుల వెనుకంజ



**వాషింగ్టన్ :** అమెరికాకు వలసలను పరిమితం చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుండడంతో అనేక మంది వలసదారులు భయాందోళలనతో గడపుతున్నారు. ముఖ్యంగా ఇంటిలోనే కాలక్షేపం చేస్తున్నారు. విదేశీ ప్రయాణాలంటే భయపడుతున్నారు. వలసదారులే కాదు అమెరికా పౌరులు సైతం దేశం విడిచి వెళ్లడానికి ఇష్టపడడం లేదు. అవసరమైన పత్రాలు చేతిలో ఉన్నప్పటికీ వారు విదేశీ ప్రయాణమంటేనే జంకుతున్నారని కేఎఫ్ఎఫ్-ఎన్వైటీ సర్వే తెలిపింది. వలసదారులలో 27 శాతం మంది అంటే ప్రతి పది మందిలో ముగ్గురు ఉద్దేశపూర్వకంగానే దేశంలోనూ, విదేశాలకు ప్రయాణాలను మానుకుంటున్నారు. ఇమ్మిగ్రేషన్ అధికారుల నిఘానేత్రానికి ఎక్కడ చిక్కుతామోనని వారు భయపడుతున్నారు. హెచ్-1బి వీసాలు ఉన్న వారిలో 32 శాతం మంది, పౌరుల్లో 15 శాతం మంది ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారని సర్వే చెబుతోంది. సరైన పత్రాలు లేని వలసదారులలో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. వీరిలో మూడింట రెండు వంతులు లేదా 63 శాతం మంది దేశీయ, అంతర్జాతీయ ప్రయాణాలు మానుకుంటున్నారు. అమెరికాలో వార్షిక సెలవుల సీజన్‌లో ఇప్పటికే సగం పూర్తయింది. ఈ సీజన్‌లో సాధారణంగా అమెరికాలో ప్రయాణాలు అధికంగా జరుగుతుంటాయి. లక్షలాది అమెరికన్లు రోడ్డు, గగనతల మార్గాలలో ప్రయాణిస్తుంటారు. ఇలాంటి సీజన్‌లో సైతం ప్రయాణాలు పెద్దగా జరగకపోవడం గమనార్హం. ఇమ్మిగ్రేషన్ అధికారుల దృష్టిలో పడడం ఎందుకనే భావనలో వలసదారులు ప్రయాణాలకు సిద్ధపడడం లేదని సర్వే తెలిపింది. అదీకాక దేశీయ విమానాలపై అధికారులు దృష్టి సారించడం ఇదే మొదటిసారి. సాధారణంగా డిసెంబర్ వరకూ వారు వాటి జోలికి పోరు. అమెరికాలో చట్టవిరుద్ధంగా ఉంటున్న వలసదారుల అరెస్ట్, నిర్బంధం, అప్పగింతకు వీలుగా ప్రభుత్వ సంస్థలన్నీ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు ట్రంప్ ప్రభుత్వం వీలు కల్పించింది. భారత్ వంటి దేశాలకు వెళ్లి తిరిగి అమెరికా చేరుకోవాలనుకునే హెూచ్-1బి వీసాదారులపై అధికారులు తనిఖీలు పెంచారు. వారి వీసా అపాయింట్‌మెంట్లు కూడా ఆలస్యమవుతున్నాయి. వలసదారులు ప్రయాణాలు మానుకోవడానికి ఇది కూడా కారణమేనని సర్వే చెబుతోంది.

# దేశ వ్యాప్తంగా డెలివరీ బాయ్స్ సమ్మె

## సమ్మెలో లక్షా 50 వేల మంది




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** డెలివరీ యాప్‌లలో అమలు చేస్తున్న 10 నిమిషాల ఫాస్ట్ డెలివరీ ఆప్షన్‌ను వెంటనే తొలగించాలని, అలాగే పాత పేఔట్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గిగ్ వర్కర్లు బుధవారం దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (%×ఖీూ%) ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మెకు పెద్ద ఎత్తున స్పందన లభించింది. దీని ప్రభావంతో పీక్ అవర్స్‌లో డెలివరీ సేవలు తీవ్రంగా అంతరాయం కలగనున్నట్లు కార్మిక సంఘాలు హెచ్చరించాయి.

గిగ్ వర్కర్ల ప్రకారం, ఫాస్ట్ డెలివరీ మోడల్ వల్ల కార్మికులపై అసురక్షిత ఒత్తిడి రుగుతోంది. నిర్ణీత సమయంలో ఆర్డర్ డెలివరీ చేయాలనే ఒత్తిడితో రోడ్లపై వేగంగా వెళ్లాల్సి వస్తోందని, దీని వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నా, పేఔట్ విధానాల్లో మార్పుల కారణంగా తమ ఆదాయాలు గణనీయంగా తగ్గిపోయాయని వాపోయారు. గతంలో దసరా, దీపావళి, బక్రీద్ వంటి పండుగల సమయంలో సరసమైన చెల్లింపులు ఉండేవని, ఇప్పుడు ఆ విధానం పూర్తిగా మారిపోయిందని గిగ్ వర్కర్ల సంఘం తెలిపింది. అప్పట్లో ఇచ్చిన రేటు కార్డ్, ఇన్సెంటివ్ విధానాన్ని మళ్లీ అమలు చేయాలని డిమాండ్ చేసింది. అలాగే సరైన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం, బీమా వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించాలని స్విగ్గీ, జొమాటో వంటి అగ్రిగేటర్ కంపెనీలను కోరింది. ఆందోళనల్లో పాల్గొంటున్న కార్మికులను అగ్రిగేటర్ కంపెనీలు బెదిరిస్తున్నాయని గిగ్ వర్కర్లు ఆరోపించారు. టీమ్ లీడర్లు, ఏరియా మేనేజర్ల ద్వారా ఐడీలను బ్లాక్ చేయిస్తున్నారని మండిపడ్డారు. డిసెంబర్ 25న జరిగిన ఆందోళనల్లో సుమారు 40 వేల మంది కార్మికులు పాల్గొనడంతో సగానికి పైగా డెలివరీలు ఆలస్యమయ్యాయని ఐఎఫ్ఏటీ వెల్లడించింది.

సమ్మెలో లక్షా 50 వేల మంది వరకు పాల్గొనే అవకాశం ఉందని పేర్కొంది. డెలివరీ ఏజెంట్లు మాట్లాడుతూ, రోజుకు 14-16 గంటలు రోడ్లపై గడిపినా సరైన ఆదాయం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక డెలివరీ ఏజెంట్ మాట్లాడుతూ, "ఎన్ని సమస్యలు ఉన్నా కస్టమర్ ముందు చిరునవ్వుతో మాట్లాడాలి. ఆర్డర్ రద్దైతే తప్పు మనదే కాకపోయినా పెనాల్టీ మాత్రం రైడర్ మీదే పడుతుంది" అని వాపోయాడు. మరో ఏజెంట్ ప్రకారం, గతంలో రేటు కార్డ్ బాగుండేదని, కానీ ఇటీవల చేసిన మార్పులు రైడర్లను ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నాయని చెప్పాడు. బరాఖంబా ప్రాంతంలో ఇటీవల జరిగిన ఒక ప్రమాదాన్ని ఉదాహరణగా చెబుతూ, ఆ రైడర్‌కు కంపెనీ నుంచి ఎలాంటి బీమా సాయం అందలేదని తెలిపారు. చివరకు తోటి కార్మికులే డబ్బులు వేసి సహాయం చేశారని పేర్కొన్నారు. టీమ్ లీడర్లు ఫోన్ కాల్స్‌కు స్పందించరని, ప్రశ్నిస్తే ఐడీ బ్లాక్ చేస్తారని ఆరోపించారు. "14 గంటలు పని చేసినా రోజుకు రూ.700%-%800 మాత్రమే వస్తోంది" అని పలువురు తెలిపారు. ఇదిలా ఉండగా, ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా 10 నిమిషాల డెలివరీ యాప్‌లను నిషేధించాలని మరోసారి డిమాండ్ చేశారు. గిగ్ వర్కర్ల కష్టాల మీదే కంపెనీలు బిలియన్ డాలర్ విలువైన యూనికార్న్‌లుగా మారాయని అన్నారు. ఫాస్ట్ డెలివరీ గ్యారంటీ వల్ల రైడర్లు ప్రమాదకరంగా డ్రైవ్ చేయాల్సి వస్తోందని, అయినా వారికి సాధారణ కార్మిక హక్కులు కూడా లేవని విమర్శించారు. గిగ్ వర్కర్ల పనిగంటలకు పరిమితి విధించాలని ఆయన సూచించారు.




# 5-0తో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్




భారత మహిళల జట్టు శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్?ను క్లీన్ స్వీప్ చేసింది. జోరు కొనసాగిస్తూ ఆఖరి టీ20లో 15 పరుగుల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (68) మెరవడంతో మొదట భారత్ 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. అరుంధతి రెడ్డి (27 నాటౌట్) బ్యాట్ ఝుళిపించింది. ఛేదనలో లంక 7 వికెట్లకు 160 పరుగులే చేయగలిగింది.

హాసిని పెరీరా (65), ఇమేషా (50) అర్ధశతకాలు చేసినా ఫలితం లేకపోయింది. దీప్తి, ఆరుంధతి, స్నేహ్, వైష్ణవి, శ్రీచరణి, అమన్‌జ్యోత్ తలో వికెట్ పడగొట్టారు. టీ20 క్రికెట్లో భారత్ 5-0తో సిరీస్ గెలవడం ఇది మూడోసారి. సొంతగడ్డపై మొదటిసారి. హర్మన్‌ప్రీత్ కౌర్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. షెఫాలి వర్మ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా ఎంపికైంది.

ఛేదనలో 7 పరుగులకే ఓపెనర్ చమరి (2)ని కోల్పోయినా, హాసిని, ఇమేషా రాణించడంతో శ్రీలంక 11 ఓవర్లలో 86/1తో బలమైన స్థితిలో నిలిచింది. కానీ ఇమేషాను ఔట్ చేయడం ద్వారా ఈ భాగస్వామ్యాన్ని అమన్‌జ్యోత్ విడదీయడంతో లంక ఇన్నింగ్స్ గతి తప్పింది. అక్కడి నుంచి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన ఆ జట్టు. ఛేదనలో వెనుకబడి పోయింది. సాధించాల్సిన రన్‌రేట్ క్రమంగా పెరుగుతూ పోయింది. నీలాక్షిక (3), కవిష (5) విఫలమయ్యారు. 17 ఓవర్లలో 132/5తో నిలిచింది లంక. మిగతా ఆట లాంఛనమే. దీప్తి శర్మ మహిళల టీ20 క్రికెట్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలిచింది. ఆస్ట్రేలియాకు చెందిన మెగాన్ షట్ (151)ను ఆమె అధిగమించింది.

భారత్ మెరుగైన స్కోరు సాధించిందంటే ప్రధాన కారణం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఆట తీరు అని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభం పేలవంగా దక్కింది. ఓపెనర్లు షెఫాలి వర్మ (5), కమలిని (12) విఫలమయ్యారు. ఓ వైపు హర్మన్ నిలిచినా, రిచా ఘోష్ (5), దీప్తి శర్మ (7) కూడా పెవిలియన్ బాట పట్టడంతో భారత్ 11వ ఓవర్లో 77/5తో తక్కువకే ఆలౌటయ్యే ప్రమాదంలో పడింది. కానీ పట్టుదలతో నిలిచిన హర్మన్‌ప్రీత్ చక్కని షాట్లతో అలరించింది. చకచకా బౌండరీలు కొట్టి దూసుకుపోయింది. అర్ధశతకం సాధించింది. చివర్లో హర్మన్ కూడా నిష్క్రమించినా.. అరుంధతి రెడ్డి విరుచుకుపడడంతో ఆఖరి రెండు ఓవర్లలో భారత్‌కు 32 పరుగులు లభించాయి. ఆఖరి ఓవర్లో మల్కీ బౌలింగ్‌లో అరుంధతి వరుసగా 6, 4, 4 బాదింది.

భారత్ ఇన్నింగ్స్: షెఫాలి వర్మ (సి) ఇమేషా (బి) నిమష 5బీ కమలిని ఎల్బీ (బి) కవిష 12బీ హర్లీన్ డియోల్ (బి) రష్మిక 13బీ హర్మన్‌ప్రీత్ (బి) కవిష 68బీ రిచా ఘోష్ (సి) కౌశిని (బి) చమరి 5బీ దీప్తి శర్మ (సి) నిమష (బి) చమరి 7బీ అమన్‌జ్యోత్ కౌర్ (సి) కవిష (బి) రష్మిక 21బీ అరుంధతి రెడ్డి నాటౌట్ 27బీ స్నేహ్ రాణా నాటౌట్ 8బీ ఎక్స్‌ట్రాలు 9

మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 175

శ్రీలంక ఇన్నింగ్స్: హాసిని (బి) శ్రీచరణి 65బీ చమరి (సి) దీప్తి (బి) అరుంధతి 2బీ ఇమేషా (సి) షెఫాలి (బి) అమన్‌జ్యోత్ 50బీ నీలాక్షిక ఎల్బీ (బి) దీప్తి 3బీ కవిష (బి) వైష్ణవి 5బీ హర్షిత (సి) హర్లీన్ (బి) స్నేహ్ 8బీ కౌశిని రనౌట్ 1బీ రష్మిక నాటౌట్ 14బీ మల్కీ నాటౌట్ 5బీ ఎక్స్‌ట్రాలు 7

మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 160

# శ్రేయస్ అయ్యర్ రీఎంట్రీ మరింత ఆలస్యం




టీమిండియా వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ రీఎంట్రీ మరింత ఆలస్యం కానుంది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నుంచి అతడికి ఇంకా అనుమతి లభించలేదు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే మ్యాచులో గాయపడిన శ్రేయస్.. ఇంకా ఫిట్‌నెస్ సాధించలేదు. అయితే టీ20 ప్రపంచ కప్ 2026కి ముందు టీమిండియా న్యూజిలాండ్‌తో మూడు వన్డేలు ఆడనుంది. ఈ జట్టులోకి అయ్యర్‌ను తీసుకోనున్నారనే వార్తలూ వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ వార్తలన్నింటికీ చెక్ పడినట్లు అయింది. న్యూజిలాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు దూరమయ్యే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది. జనవరి 11 నుంచి ప్రారంభమయ్యే ఈ సిరీస్‌కు సంబంధించి బీసీసీఐ నుంచి ఇప్పటివరకు అతడికి ఫిట్‌నెస్ క్లియరెన్స్ లభించలేదు. బ్యాటింగ్‌కు సిద్ధంగా ఉన్నప్పటికీ, పూర్తి స్థాయి ఫీల్డింగ్ చేయడానికి అవసరమైన శక్తిని ఇంకా తిరిగి పొందలేదని సమాచారం. ఆస్ట్రేలియాతో అక్టోబర్‌లో జరిగిన వన్డే మ్యాచ్‌లో అలెక్స్ క్యారీ క్యాచ్‌ను పట్టుకునే ప్రయత్నంలో డైవ్ చేయగా శ్రేయస్‌కు ప్లీహం (స్ప్లీన్) తీవ్రంగా గాయపడింది. స్కాన్లలో అంతర్గత రక్తస్రావం గుర్తించడంతో అతడిని వెంటనే సిడ్నీలో ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. రక్తస్రావాన్ని నియంత్రించేందుకు చిన్న శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. అనంతరం భారత జట్టు వైద్యుల పర్యవేక్షణలో కోలుకున్న శ్రేయస్ భారత్‌కు తిరిగొచ్చాడు. ఇక గాయం కారణంగా శ్రేయస్ సుమారు 6 కిలోల బరువు తగ్గినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కండరాల బలం తగ్గడంతో ఫిట్‌నెస్‌పై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. రికవరీ ప్రణాళిక ప్రకారం జనవరి 3, 6 తేదీల్లో ముంబై తరఫున విజయ్ హజారే ట్రోఫీలో రెండు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉందన్న వార్తలు వచ్చినప్పటికీ, అది అతడి శారీరక స్థితిపై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది. 'శ్రేయస్ ఇప్పటికే స్కిల్ ట్రైనింగ్ ప్రారంభించాడు. ప్రస్తుతం అతడు మంచి స్థితిలోనే ఉన్నాడు.




## యశ్ 'టాక్సిక్' నుంచి
# నయనతార క్రేజీ ఫస్ట్ లుక్

'కేజీఎఫ్ 2'తో బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన రాకింగ్ స్టార్ యశ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. గీతు మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి ఈ రోజు నయనతార ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆమె 'గంగ' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపిం చనున్నారు.



విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకులను విశేషంగా ఆకటుట్టుకుంటోంది. ఒక భారీ క్యాసినో బ్యాక్‌డ్రాప్‌లో.. చేతిలో గన్ పట్టుకుని, కళ్లలో తీక్షణతతో నయనతార ఎంతో స్టైలిష్‌గా, అంతే ప్రమాదకరంగా కనిపిస్తున్నారు. ఆమె హావభావాలు సినిమాలోని ఇంటెన్సిటీని, భారీతనాన్ని తెలియజేస్తున్నాయి. ఈ పాత్ర గురించి డైరెక్టర్ గీతు మోహన్ దాస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నయనతార స్టార్ డమ్ గురించి, ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ గురించి మనందరికీ తెలిసిందే. కానీ 'టాక్సిక్'లో ఆమెలోని సరికొత్త నటనా ప్రతిభను చూస్తారు. షూ టింగ్ జరుగుతున్న కొద్దీ గంగ పాత్ర ఆత్మకు, నయన తార వ్యక్తిత్వానికి చాలా దగ్గరి పోలికలు ఉన్నాయని నేను గమనించాను" అని ఆమె పేర్కొన్నారు. ఈ చిత్రంలో ఇప్పటికే కియారా అద్వానీ 'నాడియా'గా, హుమా ఖురేషి 'ఎలిజబెత్'గా నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. యశ్, వెంకట్ కే నారాయణ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా, నేషనల్ అవార్డ్ విన్నర్ రాజీవ్ రవి సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. జాన్ విక్ ఫేమ్ జేజే పెర్రీతో పాటు అన్బరివ్ మాన్‌స్టర్స్ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఏకకాలంలో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు పలు భాషల్లో డబ్ చేయనున్నారు. ఉగాది, ఈద్ పండుగలను పురస్కరించుకుని 2026 మార్చి 19న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.

## నాన్న పెద్దగా పట్టించుకోడు
# శ్రీకాంత్ తనయుడు రోషన్



ఇప్పుడు కొత్తగా వస్తున్న యంగ్ హీరోలలో, కాస్త గట్టిగానే నిలబడే హీరోగా శ్రీకాంత్ తనయుడు రోషన్ కనిపిస్తున్నాడు. చక్కని కనుముక్కుతీరు .. హైటూ .. పర్సనాలిటీ .. ఒక హీరోకి ఉండవలసిన లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. 'ఛాంపియన్' సినిమా చూసినవారికి రోషన్ పై మరింత నమ్మకం ఏర్పడింది. శ్రీకాంత్ మాదిరిగానే రోషన్ నిలదొక్కుకుంటాడనే టాక్ బలంగానే వినిపిస్తోంది. తాజాగా 'గ్రేట్ ఆంధ్ర'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో రోషన్ అనేక విషయాలను గురించి ప్రస్తావించాడు. "నా చిన్నప్పటి నుంచి కూడా నాన్న కెరియర్ ను చూస్తూ పెరిగాను. సినిమాలను గురించి నాన్న ఎక్కువగా మాట్లాడతారు గానీ .. అమ్మ ఆ టాపిక్ తీసుకు రాదు. సినిమా ఇండస్ట్రీ ఎలా ఉంటుంది .. ఇక్కడ ఎలా నడుచుకోవాలి .. ఎలా మాట్లాడాలి? సక్సెస్ లు వచ్చినప్పుడు .. ఫెయిల్యూర్ లు వచ్చినప్పుడు ఎలా ఉండాలి? అనే విషయాలను నాన్న చెబుతుండేవారు. పర్సనల్ లైఫ్ దెబ్బతినకుండా సినిమాలను ప్లాన్ చేసుకోవాలని అంటుండే వారు. ఆ మాటలు గుర్తుపెట్టుకుంటాను" అని అన్నాడు.

"ఇక నా దగ్గరికి వచ్చిన కథల విషయంలో నాన్న పెద్దగా జోక్యం చేసుకోరు. ఒకసారి వినేసి ఏమైనా లోపాలు ఉంటే, అక్కడ ఒకసారి చెక్ చేసుకో అని చెప్పేసి వెళ్లిపోతారు. నా నిర్ణయాలు నేనే తీసుకోవాలనేది ఆయన ఉద్దేశం. అలాగే ఈ జనరేషన్ కి తగినట్టుగానే నా ఆలోచనలు ఉంటాయనే నమ్మకం కూడా ఆయనకి ఉంది. ఒక వైపున ఫ్రెండ్స్ కీ .. ఒక వైపున ఫ్యామిలీకి .. మరొక వైపున సినిమాలకి నాన్న ఇచ్చే ఇంపార్టెన్స్ నాకు బాగా నచ్చుతుంది" అని చెప్పాడు.




# ప్రభాస్ 'రాజా సాబ్' చిత్రంలో 'అనిత'గా రిద్ధి కుమార్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, ప్రముఖ దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న హారర్ థ్రిల్లర్ చిత్రం 'ది రాజా సాబ్' నుంచి మరో ఆసక్తికరమైన అప్డేట్ వచ్చింది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న నటి రిద్ధి కుమార్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం బుధవారం విడుదల చేసింది. ఈ సినిమాలో ఆమె 'అనిత' అనే పాత్రలో కనిపించనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. చిత్ర నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సోషల్ మీడియా వేదికగా ఈ పోస్టర్‌ను పంచుకుంటూ.. "ది రాజా సాబ్ ప్రపంచం నుంచి అనితను కలవండి. సహజంగానే మిమ్మల్ని ఆకర్షించే వ్యక్తిత్వం ఆమెది" అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ జోడించింది.

ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులలో భారీ అంచనాలను రేకెత్తించింది. హారర్ అంశాలకు మారుతి మార్క్ కామెడీ తోడవ్వడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా ప్రభాస్ హిప్నోటైజ్ అయ్యే సన్నివేశాలు, వీటీవీ గణేశ్ తో సాగే సంభాషణలు నవ్వులు పూయిస్తాయని ట్రైలర్ ద్వారా స్పష్టమైంది.

మరోవైపు ఈ చిత్రంలో సంజయ్ దత్ ఒక ఎక్సార్సిస్ట్‌గా, హిప్నోటిస్ట్‌గా కనిపించనున్నారు. ఇక ప్రభాస్ డెమన్ (దెయ్యం) గెటప్‌లో సిగార్ తాగుతూ, తలక్రిందులుగా కూర్చున్న షాట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రభాస్ కెరీర్‌లోనే ఇది తొలి పూర్తి స్థాయి హారర్ ఎంటర్టైనర్ కావడం విశేషం. ఈ చిత్రంలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. తమన్ సంగీతం, కార్తీక్ పళని సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రం 2026 జనవరి 9న థియేటర్లలో సందడి చేయనుంది.

Edited, Printed, Published & Owned by LEKKALA SREENU and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at Guddapuvalasa Ramani, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082